ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 6 | ఫిబ్రవరి 2021

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977


ఈ సంచికలో....


11-02-1987 గుమ్మలూరు

అరుణాచల మహత్యం

శ్రీమద్భగవద్గీత



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 11 ఫిబ్రవరి 1987, గుమ్మలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహం లేని పల్లెటూరుగానీ, టౌను కానీ, సిటీ కానీ లేనే లేదు. శివాజీ అంటే మహారాష్ట్రలో ఎంతో ప్రీతి. మా శివాజీ, మా శివాజీ అంటారు. శివాజీ శివాజీ అనేది కాదు వాళ్ళ అమ్మ. శివ, శివ అని పిలిచేది. భారతీయుల యొక్క పవిత్రమైన గ్రంధాలలో కథలు తీసి వాళ్ళ అమ్మ శివాజీకి చెప్పేది. సర్వసాధారణంగా స్థూలబుద్ధి ఉన్నవాడికి కథ ప్రధానం. సూక్ష్మబుద్ధి ఉన్నవాడికి కథ లోపల ఉన్న సారం ప్రధానం. ఒక రోజున శివరాత్రి వచ్చింది. శివాజీకి శివరాత్రి రోజున శివుడు కథలు చెబుతోంది వాళ్ళ అమ్మ. ఆ రోజున చాలామంది జాగారం చేస్తారు. కానీ ఆ ఇంట్లో వాళ్ళు కొంతమంది నిద్ర పోతున్నారు. పక్కింటి వాళ్ళు నిద్రపోతున్నారు. అందరూ జాగరణ చేయరు కదా. కొంతమంది నిద్ర పోతున్నారు. ఈ తల్లీకొడుకులు శివుని యొక్క కథలు చెప్పుకుంటున్నారు. శివుడు మహా దేవుడు. అతని విశేషం గురించి, శివుడి యొక్క జన్మ గురించి తల్లి చెబుతుంటే శివాజీ యొక్క దృష్టి మళ్లింది. అమ్మా ఏమిటి మనం శివుడి కథలు చెప్పుకుంటున్నాం. కొంతమంది నిద్రపోతున్నారు. కుంభకర్ణుడు లాగ నిద్రపోతున్నారు అన్నాడు శివాజీ. అప్పుడు వాళ్ళ అమ్మ అంది శివ నాకు నువ్వు మాట్లాడే పద్ధతి నచ్చలేదు. నువ్వు ఏమి అనుకుంటున్నావు. మా అమ్మ భక్తురాలు, నేను భక్తుడని, మా అమ్మ కథలు చెబుతోంది, నేను వింటున్నాను అని నీకు తెలియకుండానే నీలో కొంచెం అహంభావం ప్రవేశించింది. నేను

భక్తుడను, నేను ఎంతో శివుడిని స్మరించుకుంటున్నాను. కానీ ఇతరులు అందరు కూడా కుంభకర్ణుడిలాగా నిద్రపోతున్నారు అని నువ్వు అంటున్నావు. ఈ రకంగా మాట్లాడే నువ్వు, ఈ రకంగా భక్తిగా ఉండటం కంటే అలా కుంభకర్ణుడిలాగే నువ్వు మారి ఉంటే నేను ఎక్కువ సంతోషించి ఉంటాను. వాళ్ళని విమర్శించే బదులు వాళ్ళ లాగ నువ్వు ఉండిపో, నేను ఎక్కువ సంతోషిస్తాను అంది. నేను భక్తుడిని అని కాని, నేను పవిత్రుడిని అని కాని, నేను ఎంతో ఉత్తముడిని అని కాని ఈ రకమైన అహంభావం రానివ్వకు. వాళ్ళ అమ్మ ఎంత దూరం ఆలోచించి చెప్పిందో, ఎంత చక్కగా సరిదిద్దిందో వాళ్ళ అబ్బాయిని అందుచేత అతను శివాజీ అయ్యాడు. మహారాష్ట్రకి అధిపతి అయ్యాడు, దేశానికి ఎంతో గౌరవం తెచ్చాడు.

ఈశ్వరుడు చూసేది నీకున్న రూపాయలని, నీకున్న ఎకరాలని కాదు, మీరు ఎంత వరకు సన్మార్గంలో ఉన్నారు. అది ఈశ్వరుడు చూసేది. కనిపించడానికి అందరూ మనుషులే, కానీ సత్పురుషులను, సహృదయం ఉన్నవాళ్ళను మనం వెతుక్కోవాలి. మనం కష్టపడి వెతుక్కుని పట్టుకోవాలి. మంచి శాస్త్రం, మంచి గురువు, మంచి మార్గం, మంచి హృదయం గల స్నేహితుడు మనం ఎన్ని జన్మల నుంచి పుణ్యం చేసుకొంటూ వస్తే మనకు లభిస్తారు? ఈ మధ్య బోంబేలో ఒక పెద్ద పత్రికా రచయిత ఉపన్యాసం చెబుతున్నాడు. అతను ఏమని చెప్పాడు అంటే ఈ ప్రార్థనలు, పూజలు ఎందుకు? అవి నాకు చిరాకు. ఈ ప్రార్థనలు పేరు చెప్పి, ఈ పూజలు పేరు చెప్పి మీరు సమయం పాడుచేసుకోకండి అని చెబుతూ మళ్ళీ జారిపోయాడు. మళ్ళీ ఏమన్నాడు అంటే అది కాదుఅన్నిటికంటే ఏది గొప్పది అంటే మనశ్శాంతి చాలా గొప్పది. మనశ్శాంతి అందరికి కావాలి. మనశ్శాంతి లేకపోతే ఏమీ లేదు. ఈలోకంలో అన్నిటికంటే మనశ్శాంతి ఎక్కువ పవిత్రమైనది అని చెప్పాడు. ప్రార్థన లేకుండా, పూజలు లేకుండా, ఈశ్వరుడు యందు భక్తి లేకుండా మనకు మనశ్శాంతి ఎలా వస్తుంది? ఈ ప్రార్థనలు, ఈ పూజలు, ఈ జపాలు, ఇవన్నీ మనస్సు అణగటానికే. ఎవరైతే జ్ఞానం కావాలి అనుకుంటున్నారో, ఎవరైతే ఒడ్డుకు చేరుకోవాలి అనుకుంటున్నారో, మీ హృదయంలో ప్రకాశిస్తున్న ఆ పురుషోత్తముడుని ఎవరైతే పట్టుకోవాలి అనుకుంటున్నారో వాళ్ళు రెండు విషయాలు జ్ఞాపకం ఉంచుకోవాలి. లోకం యొక్క పొగడ్తలను మీరు స్వీకరించకండి, లోకం యొక్క నిందని కూడా మీరు స్వీకరించకండి. లోకం యొక్క పొగడ్తని మీరు స్వీకరిస్తే, లోకం యొక్క నిందని మీరు స్వీకరిస్తే మీకు దేహబుద్ధి పెరిగిపోతుంది. అందుచేత

లోకం యొక్క పొగడ్తలకి, లోకం యొక్క నిందలకి దూరంగా ఉండండి. లోకం యొక్క పొగడ్తలకు, లోకం యొక్క నిందలకు దూరంగా ఉంటే మీ మనస్సు ఈశ్వరుడు వైపుకి తిరుగుతుంది.

గౌతమబుద్ధుడు ఎంత బియ్యం కావాలో, ఎంత అన్నం కావాలో, లెక్క వేసుకుని భిక్షకు అన్ని గృహాలు తిరిగేవాడు. గౌతమ బుద్ధుడు వెళ్ళి భిక్షాందేహి అనేవాడు. ఒకతనికి ఆయనను చూస్తే రోత అనిపించింది. ఆయనను తిట్టి వెళ్ళిపో అన్నాడు. అలాగే ప్రశాంతంగా వెళ్ళిపోయాడు. మళ్ళీ రెండో రోజున వచ్చి భిక్షాందేహీ అన్నాడు. అతను మళ్ళీ తిట్టేవాడు, ఈయన ప్రశాంతంగా వెళ్ళిపోయేవాడు. ఆయన మొఖంలో వికారం కనపడలేదు. అలా నాలుగు రోజులు చూశాడు, ఈయన ఏమీ రియాక్ట్ అవ్వడం లేదు. అప్పుడు అతను ఈయన వెనకాల పరుగెత్తాడు. నాలుగు రోజుల నుంచి మీరు నా గుమ్మం లోకి వస్తున్నారు, నాలుగు రోజుల నుంచి మిమ్మల్ని తిట్టి పోశాను. మీరు ఏమీ మాట్లాడటం లేదు. నేను బియ్యం వేయలేదు సరికదా మిమ్మల్ని తిడుతున్నాను. మీరు ప్రశాంతంగా వెళ్లిపోతుంటే నాకు ఈ రోజున ఆశ్చర్యం కలుగుతోంది. మీరేమి రియాక్ట్ అవ్వటం లేదు ఏమిటి అని మీ వెనకాల నేను పడ్డాను అన్నాడు. అప్పుడు గౌతముడు ఏమి చెప్పాడు అంటే నువ్వు అసలు బియ్యం వెయ్యలేదు, నువ్వు వేస్తే అది నేను పుచ్చుకుంటే నాకు వస్తుంది. నువ్వు వేసిన బియ్యం నేను పుచ్చుకోను అనుకో అది నీ దగ్గరే ఉంటుంది. అదే విధంగా నువ్వు బియ్యం అసలు నాకు వెయ్యనే లేదు కానీ తిట్లు తిడుతున్నావు. అవి నేను స్వీకరించటం లేదు. అందుచేత నాకు రియాక్షన్ లేదు అని చెప్పాడు. గౌతమబుద్ధుడితో మాట్లాడిన ఆ సెకనులో అతను ఎంతో బాగుపడి ఉంటాడు.

కృష్ణుడు కాలంలో దుర్యోధనుడు ఉన్నాడు కదా, అయితే కృష్ణుడిని ఎంతవరకు గుర్తించాడు? అలాగే భీష్ముడి కాలంలో అందరు భీష్ముడిని గుర్తించారా? గుర్తించ లేదు. నామదేవుడు అనే భక్తుడు ఉండేవాడు. అతను చాలా ప్రశాంతంగా ఉండేవాడు. అతని శాంతిని చూసి కొంతమందికి అసూయ కలిగేది. ఒక రోజున ఆ ఊరుకి ఎవరో వచ్చి "ఏవండీ మా అబ్బాయి ఉపనయనం చేస్తున్నాను ఎవరికి తోచిన సహాయం వారు చేయండి" అని అడిగారు. కొంతమంది అర్థరూపాయి ఇచ్చారు, కొంతమంది పావలా ఇచ్చారు. కొంతమంది అసలు డబ్బే ఇవ్వలేదు. వాడు ఊరంతా తిరిగితే రూపాయిన్నర వచ్చింది వాడికి, ఇదేమిటి మనం ఈ గ్రామం వచ్చాం, మనకి మూడు వందలు కావాలి. కష్టపడి

తిరిగితే రూపాయిన్నర వచ్చింది ఏమిటి? అని ఆయనకు విసుగు వచ్చేసింది. ఆ ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోతూ అక్కడ ఉన్న ఒకరితో "ఏవండీ మీ ఊరు అంతా తిరిగాను, ఏదో మా అబ్బాయికి ఉపనయనం చేసుకోవడానికి వచ్చాను. మీ ఊరు అంతా తిరిగితే రూపాయిన్నర వచ్చింది అండి" అని ఆ డబ్బులు ఇవ్వబోతుంటే ఆపుచేసి "ఏమయ్యా! ఏమిటి? నీకు డబ్బు ఎంత కావాలి?" అని అడిగాడు. "నాకు మూడు వందలు అయితే మా అబ్బాయికి ఉపనయనం అయిపోతుంది". ఇప్పుడు ఎంత వచ్చింది? రూపాయిన్నర వచ్చింది. మీకు మూడు వందల రూపాయిలు కావాలి. ఆ మూడు వందల రూపాయలు నేనే ఇస్తాను. కానీ ఈ ఊర్లో నామదేవుడు అని ఒకడు ఉన్నాడు. నువ్వు ఏమి చెయ్యాలి అంటే వాడికి చిరాకు తెప్పించు, కోపం తెప్పించు, ఆ మూడు వందలు నేనే ఇస్తాను నీకు. నువ్వు ఊరంతా తిరగక్కరలేదు అని చెప్పాడు. సరే అని చెప్పి ఇతడు నామదేవుడు దగ్గరకు వెళ్ళాడు, చాలా పరుష వాక్యాలు మాట్లాడాడు కానీ అతను ఏమీ డిస్ట్రబ్ కాలేదు. అప్పుడు నామదేవుడి భార్య వీపు మీద వెళ్ళి కూర్చున్నాడు. నామదేవుడు అంటున్నాడు "ఏవమ్మో వాడు మన అబ్బాయి కింద పడిపోతాడేమో జాగ్రత్త" అని చెపుతున్నాడు. "వాడు కిందకి జారిపోకుండా నేను చూసుకుంటాను. వాడు మన అబ్బాయే" అని నామదేవుడి భార్య అంది. అతను వీపు మీద నుంచి కిందకి దిగిపోయి నామదేవుడితో "మిమ్మల్ని బాధ పెట్టటం నా యొక్క ఉద్దేశం కాదు, నేను యాచన కోసం ఈ గ్రామం వచ్చాను. మీకు కోపం తెప్పిస్తే, మీకు చిరాకు తెప్పిస్తే, మీకు అశాంతి తెప్పిస్తే నాకు మూడు వందలు ఇస్తాను అని ఒక పెద్ద మనిషి చెప్పాడు, అందుకు ఈ పనులన్నీ చేస్తున్నాను" అన్నాడు. నామదేవుడు ఎంత గొప్పవాడోచూడండి. "ఏమయ్యా నాకు అపకీర్తి వచ్చినా ఫరవాలేదు. నువ్వు ముందే ఈ విషయం చెబితే నువ్వు రాగానే కోపం తెచ్చుకునేవాడిని, నీకు మూడు వందలు దక్కేవి. నాకు ముందు ఎందుకు చెప్పలేదు" అన్నాడు. అంటే ఇందులో రహస్యం ఒకటి ఉంది. ఇక్కడ హృదయం ప్రధానం, లక్ష్యం ప్రధానం కానీ లోకం నిన్ను గురించి ఏమి అనుకుంటోంది అనేది ప్రధానం కాదు. లోకం అనేదే లేదు. లోకం నిజంగా లేదు. ఆధ్యాత్మిక శిఖరాలను అందుకున్న నామదేవుడి లాంటివారు ఆ స్థానంలో ఉండి చూస్తారు. మనం ఏమి అంటాం మాటవరసకి కుండ కుండ అంటాం. కానీ మనం కుండ అన్నప్పుడు కూడా అది ఏమిటి? మట్టే. అదే విధంగా మాటలో కూడా లోకం లోకం ప్రపంచం పపంచం ఇలా అనుకుంటాం. మాటకు అనుకుంటాం. కానీ మాటకి లోకం ఉన్నప్పటికీ వస్తువు బ్రహ్మమే. ఎంత దూరం వెళ్ళి చెప్పాడో చూడండి జ్ఞానం గురించి.

జ్ఞాన యోగం, కర్మ యోగం, ధ్యాన యోగం, భక్తి యోగం, ఈ యోగాలు యొక్క ప్రయోజనం మనస్సుని బాగు చేసుకోవటం కోసం. రమణమహర్షి గారు ఈ మనస్సుకి యాతనాశరీరం అని పేరు పెట్టారు. ప్రతీ వాడికి యాతన తీసుకు వచ్చేది ఇదే. కష్టాలు తీసుకు వచ్చేది ఈ మనస్సే. మనస్సుని విడిచి పెట్టి ఏమైనా ఉందా? మన అశాంతికి, దుఃఖానికి దేహబుద్ధే కారణం. దేహబుద్ధి పోయి మనకు ఆత్మబుద్ధి రావాలి. అప్పుడు శాంతి అంటే ఏమిటో తెలుస్తుంది. ఏవండీ మన అందరికి దేహాలు కనిపిస్తున్నాయి. మీ మనస్సు వేరు, నా మనస్సు వేరు కానీ మీకో మనస్సు ఉంది మీకో దేహం ఉంది. నాకో మనస్సు ఉంది, నాకో దేహం ఉంది. అందరికి కనిపిస్తున్నాయి. ఇది యదార్థం అయితే మన దేహం మన మనస్సు నిద్రట్లో ఎక్కడకు వెళ్ళిపోతున్నాయి? నేను నిద్రట్లో ఉన్నాను. అప్పుడు నా దేహం ఎక్కడ ఉంది? నాలోనే ఉంది. గుమ్మలూరు ఎక్కడ ఉంది? నాలోనే గుమ్మలూరు ఉంది. సోదరమహాశయులారా! నిద్రలో నా దేహం నాలో లయం అయ్యింది, నా మనస్సు నాలో లయం అయ్యింది. నా ఊరు, నా దేశం, నా ప్రపంచం, ఇవన్నీ నాలో లయం అయ్యాయి. ఇవన్నీ లయం అయిపోయినప్పటికీ కూడా నేను ఉంది. మళ్ళీ నాకు మెలకువ రాగానే నా దేహం వచ్చింది, నా మనస్సు వచ్చింది, నా ఊరు వచ్చింది. అన్నీ వ్యక్తం అవుతున్నాయి. ఈ వ్యక్తం అయినప్పుడు నేను ఉన్నాను, అవి వ్యక్తం కాకుండా నాలో లయం అయినప్పుడు నేను ఉన్నాను. నాకు ఎంత కాలం అయితే అహంకారం ఉందో, నాలో నాకు దేహం వ్యక్తం అవుతూ ఉంటుంది. దేహం లయం అవుతూ ఉంటుంది. మనసు వ్యక్తం అవుతూ ఉంటుంది. మనసు లయం అవుతూ ఉంటుంది. మనస్సుని మనం విశాలం చేసుకోవాలి. విశాలమైన మనస్సు ఆత్మాకారం చెందుతుంది. మంచిగుణాలని అలవరచుకోండి, మంచిగుణాలని ప్రాక్టీస్ చేయండి అని గీతలో మనకు భగవంతుడు ఎందుకు చెప్పాడు అంటే మంచిగుణాలని అలవాటు చేసుకోవటం వల్ల మనస్సు విశాలం అవుతుంది.

మీరు ఏదైనా గ్రంథం చదివేటప్పుడు ఎవరైనా పెద్దలు చెప్పే మాటలు విన్నప్పుడు అది మీ అనుభవానికి సరిపోతుందో లేదో చూసుకోండి. పరమేశ్వరుడు మీ హృదయంలో ఉన్నాడు, మీ హృదయంలో ఉన్న ఆత్మే నిజమైన పుస్తకం. అంతకు మించిన శాస్త్రం కానీ, అంతకు మించిన దేవుడు కానీ, అంతకు మించిన గురువు కానీ బయట లేడు. నాకు రాముడు సహాయం చేశాడు, నాకు కృష్ణుడు సహాయం చేశాడు, లేకపోతే నా గురువు

నాకు సహాయం చేశాడు అని కొంతమంది చెబుతూ ఉంటారు. బయట మీకు ఎక్కడో దూరంగా ఉండి వాళ్ళు సహాయం చేస్తున్నారా? లేకపోతే మీ హృదయంలో ఆత్మగా ఉండి వాళ్ళు సహాయం చేస్తున్నారా? పరమేశ్వరుడు మీ హృదయంలోనే ఉన్నాడు. దానికి మీ మనస్సును తయారుచెయ్యి. మనస్సుని, ఇంద్రియాలని సంస్కరించుకోవాలి. మనస్సుని, ఇంద్రియాలను బాగు చేయాలి. మనస్సుని, ఇంద్రియాలను సరిచేసుకోవాలి. సరిచేసుకుంటే హృదయంలో ఉన్న పరమేశ్వరుడు మనకి అందుతాడు. దేవుడు అంటే ఏమిటండి. ఇక్కడ చిన్న కిటుకు మాయలో ఉన్నవాడు జీవుడు, మాయ లోంచి బయట పడ్డవాడు దేవుడు. ఏవండీ ఇక్కడ నేను లేను అనేవారు ఎవరైనా ఉన్నారా, సోషలిస్టులు ఉండవచ్చును, కమ్యూనిస్టులు ఉండవచ్చును అనేక రకాల వారు ఉండవచ్చును. ఏవండీ ఇప్పుడు ఎవరైనా నేను లేను అనేవారు ఎవరైనా ఉన్నారా, అందరికి నేను ఉంది, నేను నేను అంటున్నాం. మీరు నేను అంటున్నారు. అందరూ నేను నేను అంటున్నారు. ఈ నేను అనేది నిజమేనా? ఇప్పుడు ప్రపంచంలో మూడు వందల కోట్ల మంది ప్రజలు ఉన్నారు. ఈ మూడు వందల కోట్ల మంది నేనులు నిజమేనా? నిజం ఒకటిగా ఉంటుందా? మూడు వందల కోట్లుగా ఉంటుందా? మనం ఇరుగు పొరుగు వాళ్ళ గురించి విచారణ చేస్తాం, లోకం గురించి విచారణ చేస్తాం, రాజకీయాలు గురించి విచారణ చేస్తాం, కానీ ఈ నేను గురించి మటుకు విచారణ చెయ్యము. ఎవరైనా ఈ నేను గురించి విచారణ చేస్తున్నారా?సాధన చేస్తున్నారా? మనం అనే ఈ నేను పూజ చెయ్యమంటే పూజ చేస్తుంది, దేవుణ్ణి ఆరాధించమంటే దేవుణ్ణి ఆరాధిస్తుంది. ప్రార్థన చేయమంటే ప్రార్థన చేస్తుంది. కానీ దాని గురించి విచారణ చెయ్యమంటే దాని గురించి నిఘా పెడితే మటుకు అది అంగీకరించదు.

ఈ మధ్య ఒక మేధావి నన్ను ఒక ప్రశ్న వేశారు లాజికల్ మైండ్. ఎవరైనా కష్టాలలో ఉన్నప్పుడు దేవుడిని తలచుకోండి అని చెబుతూ ఉంటారు కదా, ఉదాహరణకి నా దగ్గర రూపాయలు లేవు. దేవుణ్ణి స్మరించుకోండి అని మీరు చెబుతారు అనుకోండి. దేవుడి దగ్గర రూపాయలు ఉన్నాయా అండి, నేను అడిగే వస్తువు ఆయన ఇవ్వగలడా? అది ఆయన దగ్గర ఉండాలి కదా లేకపోతే పాపం ఆయన ఏమి చేస్తాడు అంటున్నాడు. అంటే ఏమిటంటే ఇక్కడ ఈశ్వరుడు దగ్గర ఆ వస్తువు ఉందా అని కాదు, ఈశ్వరానుగ్రహం ఉంటే అన్నీ లభిస్తాయి. మనం ఏ వస్తువు అయితే కోరుతున్నామో ఆ వస్తువు అక్కడ ఉండక్కర్లేదు. ఆయన అనుగ్రహం చాలు. మనకున్న వాంఛలు నెరవేరడానికి. చాలామంది భక్తి ఎలా

ఉంటుంది అంటే వీళ్ళు పూజ చేస్తుంటే ఎదుటి వాళ్ళు చూడాలి, వీళ్ళు ప్రార్ధనలు చేస్తుంటే ఎదుటి వాళ్ళు చూడాలి, వాళ్ళు ప్రార్థన చేసుకొనేది వాళ్ళ కోసమా, ఎదుటి వాళ్ళ కోసమా? వాళ్ళ భక్తి నిజం అయితే అది నిజంగా హృదయానికి సంబంధించినది అయితే తప్పనిసరిగా ఈశ్వరకృప వర్షిస్తుంది. ఇతని కోరిక తప్పనిసరిగా నెరవేరుతుంది. అంటే వస్తువు అక్కడ ఉండాలని ఎక్కడా లేదు. ప్రార్ధనలు అవి ఎందుకు? ఈశ్వరానుగ్రహం కోసం. ఈశ్వరానుగ్రహం కలిగితే మనకు వాంఛలు నెరవేరతాయి, అన్నీ సమకూరుతాయి. మనకి భక్తి ఉన్నా లేకపోయినా భక్తి ఉన్నట్లు ఎదుటి వాళ్ళు అనుకోవాలి. ఎదుటి వాళ్ళు అనుకుంటారు అనుకోండి దానివల్ల మనకి కలిసివచ్చేది ఏమిటి? ఏవండీ దేవుడికి పబ్లిసిటీ ఎందుకండీ. దేవుడికి పబ్లిసిటీ కావాలా? పబ్లిసిటీ కోరితే దేవుడు ఎలా అవుతాడు? మీకు అతను సహాయం చేస్తున్నట్లుగా మీకు తెలియకుండా సహాయం చేస్తాడు వాడు దేవుడు. మంచివాడి లక్షణం ఏమిటి అంటే, సహృదయం ఉన్నవాడి లక్షణం ఏమిటి అంటే బుద్ధిమంతుడి లక్షణం ఏమిటి అంటే ముందు నిదానంగా ఉంటాడు. మనస్సులో ఉన్నదే నోటితోటి చెబుతాడు. నోటితోటి చెప్పింది చేతి తోటి చేస్తాడు. అది బుద్ధిమంతుడి లక్షణం. అది చేతనైతే మీరు ఇంట్లో ఉన్నా మీకు మోక్షం వస్తుంది. మనసులో ఉన్నదే నోటితోటి చెబుతాడు, నోటితోటి చెప్పిందే చేతితోటీ చేస్తాడు. ఇవి మూడు నిదానంగా ఉంటాయి. అటువంటి వాడికి ఆ జన్మలోనే మోక్షం వస్తుంది. ఇవి మూడు నిదానంగా ఉండాలి. అప్పుడే మనకు అద్వైత సుఖం అందుతుంది. మనకు అద్వైత భక్తే రాలేదు. మనకి కైలాసంలో ఉన్న శివుడి మీద, వైకుంఠంలో ఉన్న విష్ణువు మీద, సత్యలోకంలో ఉన్న బ్రహ్మ దేవుడి మీదకు మనసు వెళుతుంది కానీ మీ హృదయంలో ఆత్మ ఉంది, దేవుడు మీ హృదయంలోనే ఉన్నాడు, అని చెబితే ఎవరికీ బుర్రకి ఎక్కదు. సోదరమహాశయులారా! అద్వైతసుఖం, అద్వైతశాంతి, అది అనుభవానికి అందుతుంది కానీ మాటలకు అందదు. అది మనస్సుకి అందదు. అది ఇంద్రియాలకు అందదు, అది బుద్ధికి అందదు. అనుభవానికి అందుతుంది. మిరపకాయ ఎలా ఉంటుంది అంటే కారంగా ఉంటుంది. కారం ఎలా ఉంటుంది అని అడుగుతాడు అనుకోండి ఎవరైనా, వాడికి నోట్లో మిరపకాయ పెట్టండి వాడికి తెలుస్తుంది కదా. అలాగే హృదయంలో ఆత్మ ఉంది. అది ఎలా ఉందో అనుభవంలోకి వచ్చిన వాడికి తెలుస్తుంది. అది అనుభవైకవేద్యం. అది మాటలకి అందదు, మీ బుద్ధికి అందదు, మీ మనస్సుకు అందదు, మీ ఇంద్రియాలకు అందదు.

రమణస్వామి ఏమి చెప్పేవారు అంటే పరమార్థవస్తువును, ఆత్మవస్తువును మీరు ఊహించకండి. అది అవ్వటానికి ప్రయత్నం చెయ్యండి. ఏవండీ నేను చెప్పేది బాగా ఆలోచించండి. ఇంకొక చిన్న విషయం చూడండి. ఇంటి దగ్గర ఒక కృష్ణుడి బొమ్మో, రాముడి బొమ్మో, శివుడి బొమ్మో, ఎదురుగా పెట్టుకుంటున్నాం. మీరు అక్కడ పువ్వులు పెడతారు, ఇది దేవుడు, ఇది దేవుడు అని అనుకుంటూ ఉంటారు మీ మనసులో అలా అనుకోండి మంచిదే, ఏదోకటి అనుకోవాలి, ఏదోకటి అనుకోకపోతే మన మనస్సు ఊరుకోదు. ఏవండీ ఇంటికాడ అనుకుంటున్నారా మీరు? నేను చెప్పేవి అన్నీ నిజాలా? అబద్ధాలా? మీ ఇంటికాడ దేవతావిగ్రహాలు ఉన్నాయి, నిజమే. ఆ దేవతావిగ్రహాల దగ్గర దీపం వెలిగిస్తున్నారు. అగరవత్తులు వెలిగిస్తున్నారు, హారతి ఇస్తారు, ఇది దేవుడు, ఇది దేవుడు, కృష్ణుడు అయితే కృష్ణుడు, రాముడు అయితే రాముడు, శివుడు అయితే శివుడు, అనుకుంటారు కదా! మరి అదే దేవుడు అయితే దేవుడు ఆ విగ్రహానికి, ఫొటోకు పరిమితం అయిపోతే వాడు దేవుడు అవుతాడా? దేవుడు యొక్క పటం పెట్టి ఇది దేవుడు, ఇది దేవుడు అంటున్నారు. ఇది అది అని ఎప్పుడైతే మీరు విభజించారో, అలా ఎప్పుడైతే ఖండించారో, అప్పుడే మనకు దేవుడు దూరం అయిపోతాడు. ఎప్పుడైతే మనస్సు ఉందో ఎదుటి వస్తువును కూడా పరిమితం చేస్తుంది. స్వామి వివేకానంద చెప్పాడు. ఒక జ్ఞానిని అర్థం చేసుకోవటం కోసం ఎన్నడూ ప్రయత్నం చెయ్యకండి. ప్రయత్నం చేస్తే మీరు అర్థం చేసుకోలేరు సరికదా, మీకున్న అజ్ఞానాన్ని తీసుకెళ్ళి జ్ఞాని యందు ఆరోపిస్తారు. రమణమహర్షి వాళ్ళ ఔన్నత్యం ఎటువంటిది అంటే ఎవరైనా మీరు దేవుడు అని ఆయనతో అంటే వాళ్ళు అంగీకరించారు అంటే ఆయన పట్ల మీకు ప్రేమ ఉంటే ఆయన పట్ల మీకు విశ్వాసం ఉంటే ఆయనని దేవుడు కింద మీరు ఆరాధిస్తుంటే మీ ఏకాగ్రతను చెడగొట్టటానికి బదులు ఆయన అంగీకరిస్తాడు. ఆయనను ఆరాధించి మీరు అభివృద్ధిలోకి వస్తున్నారు అనుకోండి అది చెడగొట్టరు. ఆ రకంగా మీరు అభివృద్ధిలోకి వస్తుంటే అభివృద్ధే మంచిది అని ఆయన అంగీకరిస్తున్నాడు, మౌనంగా ఉన్నాడు అంతే! దేవుడు అంటే ఆ దేహానికే పరిమితం అని కాదు. రాముడి మీద మనకి ఇష్టం కలిగింది అనుకోండి, రామస్మరణ వినేటప్పటికి మన మనస్సు చల్లగా ఉంటోంది అనుకోండి మన మనస్సు కుదుటపడుతోంది అనుకోండి రాముడు దేవుడు అనుకోండి మంచిదే. మీరు బాగుపడటం చూసుకోండి అదీ ముఖ్యం. వాడు దేవుడా, వీడు దేవుడా అని కాదు మీరు బాగుపడటం మీరు అభివృద్ధిలోకి రావటం మీరు చూసుకోండి.

మీకు శాంతి కావాలి, మీకు ఆరోగ్యం కావాలి, మీకు సంతోషం కావాలి, మనం ఇక్కడ కూర్చుని ఇంత పెద్ద పెద్ద మాటలు చెప్పుకుంటున్నాం. కేన్సర్ రోగం వచ్చింది, ఆ కేన్సర్ రోగాన్ని ఎలా తగ్గించాలి అని రీసెర్చ్ చేయటం కోసం కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. సరే కేన్సర్ కోసం ఖర్చు పెడుతున్నారు. ఏమండీ మనలో అందరికీ ఆశ ఉందా? లేదా? ఇది అబద్ధమా? నిజమా? ఇక్కడ కేన్సర్ ఎవడికి లేదు కానీ ఆశ ఉంది. కేన్సర్ కోసం రీసెర్చ్ చేస్తున్నారు కదా, ఈ ఆశ అనేది ఎలా వచ్చింది మనిషికి అని ఎవరు రీసెర్చ్ చేయరు ఏమిటండి? ఆశే కదా మనిషికి దుఃఖం తీసుకు వచ్చేది. ఆశే కదా మనిషిని బంధించేది. ఈ ఆశ మనలో ఎలా ప్రవేశించింది? అని దీనికోసం ఎవడు డబ్బు ఖర్చు పెట్టడేమిటి? దీనిని తొలగించటం కోసం ఎవరూ ఆలోచించరు ఏమిటి? ఆశ లేని జీవుడు ఎవరైనా ఉన్నాడా? అసలు మన భక్తి మనం చేసే పూజలు కూడా ఆశ కోసమే కదా, ఇంకా మంచి జన్మ వచ్చేయాలి మనకి, అంతే కదా! మనం చేసే పూజలు, పారాయణాలు, జపాలు, తీర్థ యాత్రలు, ఇన్నిచోట్లకి తిప్పుతున్నాం కదా, ఏమండీ వీటి అన్నిటి ఉద్దేశం మనకు చాలా మంచి జన్మ వచ్చేయాలి అని, ఇంకా చాలా చక్కటి భోగాలు అనుభవించాలని. అంతే కదా. మనకు ఉన్నది భోగ దృష్టా? లేక త్యాగ దృష్టా? ఏమండీ కృష్ణుడు గీతలో భోగికి ఆత్మ అందుతుంది అని చెప్పాడా? త్యాగికి ఆత్మ అందుతుంది అని చెప్పాడా? మనం పూజలు చేసేది భోగాన్ని దృష్టిలో పెట్టుకుని చేస్తున్నామా, త్యాగాన్ని దృష్టిలో పెట్టుకుని చేస్తున్నామా? మీరు పూజలు చేయండి, జపాలు చేయండి నేను కాదు అనటం లేదు. మీరు చేసేది దేనికోసం? దేనిని ఉద్దేశించి మీరు పూజ చేస్తున్నారు? దేనిని సాధించటం కోసం మీరు ఈ పనులు చేస్తున్నారు? పూజ ఎందుకు చేస్తున్నారు? జపం ఎందుకు చేస్తున్నారు? మీ లక్ష్యం ఏమిటి?

సోదరమహాశయులారా! మనకి ఆకలి వేస్తే అన్నం తింటున్నాం, అంటే ఇంకేమి అక్కరలేదా, జీవితంలో అన్నం తింటే సరిపోతుందా? చాలామందికి తినటానికి అన్నం ఉంది, కట్టుకోవడానికి గుడ్డ ఉంది, అయితే ఈ లోకంలో దుఃఖం ఎందుకు ఉంది? ఎందుకు ఇంత విచారంగా లోకం కనిపిస్తోంది? ఎందుకు లోకంలో అంత దుఃఖం కనిపిస్తోంది? మీరు ఎవరికి అయినా దానం చేశారు అనుకోండి, ఎవరికి అయినా ధర్మం చేశారు అనుకోండి మీకు కొంత సంతోషం వస్తుంది. ఎందుకు సంతోషం వస్తోంది? దానం చేయకపోతే మీకు రోజులు వెళ్ళవా, ధర్మం చెయ్యకపోతే మీకు రోజులు వెళ్ళవా, మంచి

చేయకపోతే మీకు రోజులు వెళ్ళవా, మంచి చేస్తే మీ మనసు పొంగుతుంది, మీ మనసుకి ఎంతో కొంత సంతోషం వస్తుంది. మీ మనసుకి ఎంతో కొంత సంతృప్తి వస్తుంది. అంటే మీరు జీవించటానికి అది కూడా అవసరమే.

దేహం ఒక్కటే కాదు మానవుడు అంటే లోపల హృదయం ఉంది. లోపల మనస్సు ఉంది. నువ్వు ఏదైనా ఒక మంచి పని చేస్తే నీకు తెలియకుండా, అవ్యక్తంగా హృదయం యొక్క అంతరాళాల నుంచి మీకు సంతోషం, సుఖం, శాంతి వస్తుంది. అది కూడా ఈ జీవితానికి కావాలి. అందుకే నీకు మంచి చేయాలి అనిపిస్తుంది. ఒక్క శరీరానికే satisfaction కాదు. మీ మైండ్‌కి, మీ హృదయానికి ఒకరకమైన satisfaction కావాలి. మీరు భౌతికవాది అని తెలియటానికి ఆ satisfaction కావాలి. లేకపోతే నువ్వు జీవించలేవు ఈ లోకంలో, దేవుడి మాట అటు ఉంచండి, వైకుంఠం మాట అటు ఉంచండి. కైలాసం మాట అటు ఉంచండి. ఒక్క అన్నం తినటం వల్లే, ఒక గుడ్డ కట్టుకోవటం వల్లే నా మనస్సుకి శాంతి రాదు. నేనేదో ఒక మంచి చేయటం వల్ల, ఒక సత్కార్యం చేయటం వల్ల నా మనస్సు పొంగుతుంది. నా మనసు నుంచి శాంతి ఉబికి ఉబికి పైకి వస్తుంది, నా శిరస్సును ముంచుతుంది. మీలో ధనవంతులు ఉండచ్చు, మీ ధనం పెట్టి శాంతిని కానీ సుఖాన్ని కానీ మోక్షాన్ని కానీ మీరు కొనలేరు. భగవంతుడే చెబుతున్నాడు, నేను ఏమి చేస్తాను. అది కేవలం మీ బుద్ధికి అందదు. మీ తెలివికి అందదు. మీ మెదడుకి అందనటువంటి శాంతి ఆత్మశాంతి. అది మామూలు శాంతి కాదు. శాంతి అనేది ఆత్మకి గుణం కాదు. ఆత్మ యొక్క స్వభావం. శాంతి అనేది, సుఖం అనేది, ప్రేమ అనేది ఆత్మ యొక్క గుణం కాదు. ఆత్మ యొక్క స్వభావం. నిప్పు వేడిగా ఉంటుంది. ఆ వేడి అనేది నిప్పు యొక్క గుణం కాదు. నిప్పు యొక్క స్వభావం. అదే విధంగా శాంతి అనేది సుఖం అనేది ఆత్మ యొక్క గుణం కాదు. ఆత్మ యొక్క స్వభావం.

మీ మనస్సుని మీరు ఎవరు హింస పెట్టుకోకండి. దాన్ని ఖాతరు చేయకండి. ఈ జన్మకైనా మరొక జన్మకైనా ఈ అహంకారం లోంచి ఈ దేహం లోంచి, ఈ మనసు లోంచి వేరుపాటు కాపురం పెట్టాల్సిందే. నేను కాని శరీరం లోంచి, నేను కాని అహంకారం లోంచి, నేను కాని బుద్ధి లోంచి, నేను కాని మనస్సు లోంచి ఈ జన్మకైనా, మరొక జన్మకైనా అది నిజం కాదు కాబట్టి అందులోనుండి విడిపోవటం తప్పదు. నేను దేహం అయితే గుమ్ములూరు వదిలి జిన్నూరు వెళ్ళిపోతాను. మనం ఆత్మ అయితే ఎక్కడకు వెళతాము? వాడు చచ్చిపోయి

ఎక్కడికో వెళ్ళిపోయాడు అంటారు. వెళ్ళిపోయిన వాడు ఎవడు? మనం తల్లి కడుపులో ఉండగా ముక్కు తయారు అయ్యింది, కళ్ళు తయారు అయ్యాయి, కాళ్ళు తయారు అయ్యాయి. తల్లి కడుపులో ఉన్నప్పుడే అన్నీ తయారు అయ్యాయి. మీరు అందరూ గాలి పీల్చుకుంటున్నారా ఎవరికి అయినా అనుమానంగా ఉందా పీల్చుకుంటున్నామా లేదా అని, పీల్చుకుంటున్నారు కదా. మీరు ప్రాణాయామాలు చేస్తారు. ఎందుకు అంటే మనసుని స్వాధీనం చేసుకోవటం కోసం. మనసు, ప్రాణం రెండు ఒకేచోట పుట్టాయి. అంటే ప్రాణం యొక్క పీకి పట్టుకుంటే మనస్సు తల వంచుతుంది. మనస్సు యొక్క పీకి పట్టుకుంటే ప్రాణం తలవంచుతుంది. భగవాన్ దగ్గర కూర్చుని ప్రాణాయామం చేస్తూ కుంభకం ఆగటం లేదు అన్నాడు, స్వామి స్వామి నాకు గాలి ఆగటం లేదు అన్నాడు. అప్పుడు భగవాన్ అన్నారు మొత్తానికి ఆగిపోతే దరిద్రం వదిలిపోతుంది అన్నారు. దరిద్రం అంటే వల్లకాటిలోకి పోతావు. ఏవండీ ప్రాణాయామం రోజు చేసుకుంటున్నారా మీరు. మనస్సు యొక్క నిగ్రహానికి ప్రాణాయామం కూడా ఒక ఉపాయం. మంచిది, ఇంటికాడ చేసుకోండి. ఇంతకి మనం మాట్లాడుకునే సబ్జెక్టు తల్లి కడుపులో ఉండగా గాలి ఎలా వచ్చింది మనకి. గాలి వచ్చాక పీల్చుకుంటున్నారా, గాలి రాకముందే పీల్చుకుంటున్నారా, తల్లి కడుపులో శరీరం తయారు అయ్యిన తరువాత ఎవరి ప్రేరణ వల్ల ఈ గాలి వచ్చింది. ఏ ప్రేరణ వల్ల ఈ గాలి కదిలిందో, గాలి ఈ శరీరంలో తిరిగిందో ఆ ప్రేరణ ఏమిటి? ఆ కారణం ఏమిటి? అదే సత్యం. దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకుంటున్నాం. అక్కడే ఉన్నాడు. అతని ప్రేరణ వల్లే మనం ఈ గాలి పీల్చుకుంటున్నాం. అతని ప్రేరణ వల్లే ఈ గాలి ఆగిపోతుంది. ఎవరి ప్రేరణ వల్ల ఈ శరీరంలో గాలి వచ్చిందో మళ్ళీ వాడి ప్రేరణ వల్లే గాలి ఆగిపోతుంది.

ప్రతీవాడికి బహుమానాలే కావాలి, అవమానాలంటే ఎవడికి ఇష్టం లేదు. బహుమానాలంటే అందరికి ఇష్టమే, కానీ అవమానాలంటే ఎవరికీ ఇష్టం ఉండదు. కానీ అవమానాల వల్ల నరుడు నారాయణుడు అవుతాడు. జీవుడు దేవుడు అవుతాడు. ఎందుచేత అంటే అవమానాలు భరించటం వల్ల కూడా వాడికి కొంత strength వస్తుంది. Mentalstrength వస్తుంది వాడికి. మీరు భక్తుల చరిత్రలు చదివితే ఎన్నో కష్టాలు, ఎన్నో troubles వాళ్ళు face చేసినట్టు చెబుతారు. వీళ్ళు కష్టాలు పడుతున్నారు అని పైకి మనకు అనిపిస్తుంది. ఆ కష్టాలు అన్నీ పాపాలను కడిగేస్తాయి, వారి పాపాలను తొలగిస్తాయి. బయటకి ఊరికే కష్టాల రూపంలో ఈశ్వరుడు పంపిస్తున్నాడు ఎందుకు? మిమ్మల్ని కడగటానికి. అవి కష్టాల

కింద కనిపిస్తాయి. కానీ మిమ్మల్ని కడిగి శుద్ధి చేస్తాయి. మీకు దుఃఖం ఉంది అంటున్నారు. నేను ఉంటే దుఃఖం ఉందా, నేను లేకుండా దుఃఖం ఉందా? మీకు సంసారం ఉంది అంటున్నారు. నేను ఉంటే సంసారం ఉందా? నేను లేకుండా సంసారం ఉందా? అయితే ఈ నేను ఎవరు? ఏవండీ మీరు అందరు ఆత్మ అని భగవంతుడు చెబుతున్నాడు. ఆత్మకి చావు లేదు అంటున్నాడు. ఇవన్నీ నేను కల్పించి చెప్పటం లేదు. పరమేశ్వరుడు చెప్పిన మాటలు. మీరు శరీరం అని చెప్పటం లేదు, మీరు మనస్సు అని చెప్పటం లేదు. మీరు బుద్ధి అని చెప్పటం లేదు. మీరు ఆత్మ అని చెబుతున్నాడు. ఆత్మ మీ హృదయంలో ఉంది అంటున్నాడు. ఆత్మ మీరే అంటున్నాడు. ఆత్మకి మరణం లేదు అంటున్నాడు. అయితే మనం అందరం చచ్చిపోతున్నాం. మనమందరం చేసే పొరపాటు ఒక్కటే. నేను మరణిస్తాను, నాకు రోజులు దగ్గరకు వచ్చేస్తున్నాయి అని మనం అంటాము కదా! నేను నిజం మాటలు చెబుతున్నానా మీకు అబద్ధం మాటలు చెబుతున్నానా, నేను ఎంతో కాలం జీవించను నేను మరణిస్తాను. నేను మరణిస్తాను అని చెప్పేవాడు ఎవడు? నీకు మరణం లేదు, నువ్వు ఆత్మ స్వరూపుడవు. ఆత్మ నీ హృదయంలో ఉంది అని భగవంతుడు చెబుతుంటే ఆ ఆత్మానుభవం మీకు దొరకకుండా, ఆత్మను తెలుసుకోకుండా ఎవరు నీకు అడ్డు పడుతున్నారు? నీ అత్తగారా? నీ మేనత్తలా? నేను సరదాగా చెప్పటం లేదు. ఈ మాటలని మీరు వేళాకోళంగా తీసుకోవద్దు? భగవంతుడు చెప్పిన ఆత్మ నేనే అయితే, నా హృదయంలో ఆత్మ కనుక ఉంటే దానిని అనుభవంలోకి తెచ్చుకోవడానికి నేను ప్రయత్నం చేస్తుంటే దానిని తెలుసుకోకుండా నాకు దానికి మధ్యన ఎవరు వచ్చి నిలబడుతున్నారు. నేను చెప్పేవి అన్నీ అబద్ధాలా? నిజాలా? మీరు ఎప్పుడైనా ఆలోచించారా? నన్ను నేను తెలుసుకోకుండా ఎవరు నాకు అడ్డు వస్తున్నారు? ఎవరు ప్రతిబంధకంగా ఉన్నారు? నేను చచ్చిపోతున్నాను, నేను చచ్చిపోతున్నాను అని బాధ పడేవాళ్ళలో చచ్చిపోయేవాడు ఎవడు? నేను ఇంకో లోకానికి వెళ్ళిపోతాను, పరలోకానికి వెళ్ళిపోతాను, నేను పుణ్యాలు చేసుకున్నాను మంచిలోకాలకు వెళతాను అని కొంతమంది అనుకుంటున్నారు. అలా అనుకునేవాడు ఎవడు? నేను పాపాలు చేసాను, నరకానికి పోతాను అని కొంతమంది అనుకుంటే అలా అనుకునే వాడు ఎవడు?

భగవాన్‌తోటి ఒకతను చెప్పాడు నేను మంచివాడిని కాదు, నేను చెడ్డ పిల్లవాడిని అని చెప్పాడు. అలా నువ్వు అనుకోకు, నేను చెడ్డ పిల్లవాడిని అనుకోవద్దు. ఈ మంచి చెడ్డలు అన్నీ మనసులోనే ఉన్నాయి. చావు లేని వస్తువు మనలోనే ఉంది. దాని అనుభవం

మనకి లేదు. కాబట్టి మనం చచ్చిపోతున్నాం. మనమందరం మరణించే ఉన్నాం. కాని జీవించి ఉన్నాం అని చెప్పుకుంటున్నాం జీవించి లేము మనమందరం మరణించే ఉన్నాం. మరణం లేని వస్తువు మనకి అనుభవం లేదు కాబట్టి మరణించే ఉన్నాం, మరణం లేని వస్తువు మనలోనే ఉంది, పరబ్రహ్మాని తెలుసుకోవాలి. ఏ వస్తువుకు అయితే చావు లేదు అంటున్నాడో, ఏ వస్తువుకు అయితే ముసలితనం లేదు అంటున్నాడో, ఏ వస్తువుకు అయితే దేహానికి దానికి ఇసుమంత సంబంధం లేదు అంటున్నాడో అటువంటి ఆత్మని నిరంతరం ధ్యానించు. విషయాన్ని కాదు మనం ధ్యానం చేసేది, లోకాన్ని కాదు మనం ధ్యానం చేసేది, నిరంతరం హృదయంలో ఉన్న ఆత్మను ధ్యానం చేయగా చేయగా తదాకారం చెందుతుంది. అదే శివానందలహరిలో ఆచార్యులవారు అన్నారు. నది వెళ్లి సముద్రంలో కలుస్తూ ఉంటుంది. అది ప్రక్కకు చూడదు. అది దిక్కులు చూడదు. ఉపన్యాసాలు చేయదు, ఏ గొడవ దానికి లేదు. నది చూడండి ప్రవాహంగా వెళ్లి దాని లక్ష్యం అయిన సముద్రంలో కలుస్తుంది. అదే విధంగా మీ మనస్సు అంతా కూడా పూర్తి ఏకాగ్రత తోటి, పూర్తి లక్ష్యం తోటి ఆత్మ వైపు ప్రయాణం చేస్తుంటే మీరు ఆత్మను తెలుసుకోగలరు. ఈశ్వరుడిని ఏమీ అడగకండి. మీరు పూజలు చేసి, జపాలు చేసి ఆయనను ఏమీ అడగకండి. అడిగితే అడిగింది మాత్రమే ఇస్తాడు. మీరు ఏమీ అడగకుండా ఉంటే మీకు ఏది అవసరమో, ఎప్పుడు అవసరమో అది మీకు జాగ్రత్త పెట్టి ఇస్తాడు. మీ మనస్సుని బాగు చేస్తాడు. మీ చిత్తాన్ని శుద్ధి చేస్తాడు. మీరు పని చేసేటప్పుడు ఏ ప్రేరణ వల్ల, ఏ ఉద్దేశ్యం తోటి, ఏ ఆశయం తోటి మీరు ఆ పని చేస్తున్నారో దాన్ని బట్టి మీకు ఆధ్యాత్మిక అభివృద్ధి కలుగుతుంది. భగవంతుడు పని చేస్తాడు, కానీ ఫలితం ఆశించడు. ఎందుకంటే అక్కడ మనసు లేదు అహంకారం లేదు. సాధన అంటే ఏమీ కాదు. మీరు మీరుగా ఉండటానికి ఆత్మస్థితిని పొందటానికి మీకు ఎవరు అడ్డు వస్తున్నారు అని మీరు జాగ్రత్తగా ఆలోచించుకోండి. ఆలోచించుకుని మీకు అడ్డం వచ్చింది తొలగించుకోండి అదే సాధన. సోదరమహాశయులారా! మనం ఏన్నో పూజలు చేస్తున్నాం, మీకు అందరికి చేతులు జోడించి నమస్కరిస్తున్నాను. మీరు అందరు పూజలు చేసేటప్పుడు నా మాటలు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు భగవంతుడిని ప్రపంచంలో వస్తువులు అడుగుతున్నారు కానీ మీరు పూజ చేసేటప్పుడు కానీ మీరు ప్రార్ధన చేసేటప్పుడు కానీ మీలో ఏమైనా లోపాలుఉంటే నాలో ఫలానా లోపాలు ఉన్నాయి, ఈ లోపాలు తీసేయి నా అంతట నేను ప్రయత్నం చేసి ఈ లోపాలను తీసుకోలేక పోతున్నాను. ఓ దేవుడా నాలో ఉన్న ఈ లోపాన్ని తీసేయి అని మీరు ఎప్పుడైనా దేవుడిని

ప్రార్థించారా? ఎందుచేతనంటే మీ స్వంత ప్రయత్నం వల్ల కానీ, దేవుడి యొక్క సహాయం వల్ల కానీ మీలోని లోపాలు బయటకి వెళ్ళకపోతే, వాటిని బయటకి తీసుకోలేకపోతే దేవుడు మిమ్మల్ని అనుగ్రహించాలనుకున్నా అనుగ్రహించలేడు. నా మాటలు నమ్మండి.

వర్షం కురుస్తోంది అనుకోండి, బిందె బోర్లా పెడితే అందులో వర్షం పడదు, ఇంక ఆ బిందె నిండదు. అందులో వర్షం పడుతుంటే ఆ బిందె నిండుతుంది. ఈశ్వరానుగ్రహం ఎప్పుడూ ఉంది అయితే మనలో ఉన్న దోషాల వల్ల, మనలో ఉన్న లోపాల వల్ల, మనలో ఉన్న బలహీనతల వల్ల ఈశ్వరానుగ్రహం మనకి కలగటం లేదు. ఈశ్వరానుగ్రహం మీరు లేదు అనుకుంటున్నారు. ఈశ్వరానుగ్రహం మీరు లేదు అనుకోవద్దు. ఈశ్వరానుగ్రహం ఉంది నాలో ఉన్న లోపాలు తీసెయ్యి, నాలో ఉన్న పాపాలు కడిగెయ్యి నాలో ఉన్న బలహీనతలు తొలగించు అని మీ ప్రార్థనలో, మీ పూజలో, మీ జపంలో, మీ ధ్యానంలో ఈశ్వరుడుకి శరణాగతి కనుక పొందితే ఆ లోపాలు ఎప్పుడైతే తీసేసాడో అప్పుడు ఈశ్వరానుగ్రహం ప్రవహిస్తుంది. ఈశ్వరానుగ్రహం ఇప్పుడు కూడా ప్రవహిస్తోంది. కానీ మన బలహీనతలు అడ్డుకుంటున్నాయి. మనమందరం ఈశ్వరుడు ఉన్నాడని నమ్ముతున్నామా? లేదా? ఈశ్వరుడు ఉన్నాడని నమ్ముతున్నాం కానీ ఈశ్వరుడికి సంబంధించిన జ్ఞానం మనకి ఉందా? లేదు. కపటం ఉన్న మనిషి ఆధ్యాత్మిక జీవితానికి పనికి రాడు. అసలు వాడికేమి దొరకదు. ఈ లోకాలు, ఈ దేహాలు, ఇవన్నీ ఆత్మలో లీనం అయిపోవాల్సిందే. మనస్సు మనస్సుఅంటారు. ఎవరైనా చూశారా అండి మీ మనస్సుని. ఇక్కడ భగవాన్ ఏమి చెబుతున్నారు మనస్సు అంటే కొన్ని తలంపుల యొక్క సమూహమే మనస్సు. మనస్సు అంటే వేరుగా లేదు. మీకు వచ్చే ఆలోచనలు, మీకు వచ్చే తలంపులు, మీకు ఉండే భావనలే మనస్సు. పొయ్యిలో పుల్లలు ఉన్నాయి అనుకోండి ఒకొక్క పుల్ల ఒకొక్క పుల్ల బయటికి లాగేయండి నిప్పు ఆరిపోతుంది. అలాగే మీకు వచ్చే తలంపులను ఒకొక్క తలంపును ఈ తలంపులు ఎవరికి అని ప్రశ్నించుకుని ఒకొక్క తలంపుని తీసేస్తే ఇంక మనస్సు అనేది లేదుఅక్కడ. మనస్సు అనేది వేరుగా లేదు, అది యదార్థం కాదు. అదొక వస్తువు కాదు. నీకున్న కొన్ని తలంపులు యొక్క సమూహమే మనస్సు. ఆ తలంపుల్ని తీసేసి నీ మనస్సు ఎక్కడ ఉందో చూడు. మీకు బంగారం ఇష్టం అనుకోండి మీరు గొలుసు చేయించుకున్నారు అనుకోండి. నా బంగారం నాకు ఇచ్చేసి మీ గొలుసు మీరు ఉంచుకోండి అంటే, మీ గొలుసు ఉంటుందా మీకు? మనకి ఎప్పుడైనా కోపం వస్తుంది అనుకోండి మాటవరసకి

అదే మనస్సు, మనకి ఎప్పుడైనా చిరాకు వస్తుంది అనుకోండి అదే మనస్సు, కీర్తి సంపాదించాలి అనిపిస్తుంది అనుకోండి మనకి అదే మనస్సు, మళ్ళీ దుఃఖం వస్తుంది అనుకోండి అదే మనస్సు, ఎప్పుడైనా వేదన వస్తుంది అనుకోండి అదే మనస్సు.

మనస్సు యొక్క మాయని చిన్న ఉదాహరణలో చెబుతాను వినండి. ఈ శరీరం అంటే నాకు చాలా ఇష్టం. మీ శరీరం అంటే మీకు ఇష్టమేనా అండి? ఈ శరీరం అంటే అందరికి ఇష్టమే, ఎకరాలు అన్నా ఇష్టమే. కానీ ఎకరాలు కంటే కూడా దేహం అంటే ఇష్టం. అందుచేత దేహం కోసం ఎకరాలు అమ్మేస్తున్నారు. మా ఊర్లో పూర్వం ఒకడు రాయవెల్లూరు వెళ్ళి వైద్యం చేయించుకున్నాడు. అతనికి అరఎకరం ఉంది, పోతే అరఎకరం పోతుంది అనేవాడు. తరువాత అరెకరం పోయింది, దేహం పోయింది. దేహం అంటే మనకు ఇష్టం కాబట్టే దేహం మరణించేటప్పుడు మనకు దుఃఖం వస్తుంది. మేము ఎంత బ్రతుకు బ్రతికామండి ఈరోజున ఇలా అయిపోయిందండి అంటారు. ఏమి అయిపోయింది వాడికి? దేహం మరణించేటప్పుడు నేను మరణిస్తున్నాను అనుకుంటూ ఉంటాడు, కళ్ళ వెంట నీళ్ళు పెట్టుకుంటాడు. మీరు జాగ్రత్తగా ఆలోచించండి. నా దేహం అంటే నాకు చాలా ఇష్టం. మీ దేహం అంటే మీకు ఇష్టం లేదా అండి? మీ దేహం అన్నా మీకు ఇష్టమే. ఈ దేహాన్ని ఎవరైనా ఏమైనా అంటే ఊరుకుంటారా మీరు? ఏమీ ఊరుకోరు. ఒకసారి రమణ స్వామిని దొంగలు కొట్టారు. మరుసటి రోజు భక్తులు పరామర్శకి వెళ్ళారు. రాత్రి ఏమి జరిగింది అండి స్వామి అని అడిగితే భగవాన్ ఏమి చెప్పారు అంటే రాత్రి స్వామి వారికి పూజ జరిగింది. మీరు పగలు వచ్చి స్వామి వారికి పూజ చేస్తున్నారు, దేనితోటి? పువ్వుల తోటి పూజ చేస్తున్నారు. రాత్రి వాళ్ళు వచ్చి పూజ చేసి వెళ్ళిపోయారు. దేనితోటి పూజ చేశారు? కర్రలతోటి చేసారు.

ఒకతను పరుగెడుతూ పరుగెడుతూ పడిపోయాడు అటండి. ఏమయ్యా పడిపోయావు ఏమిటి అని అడిగితే నామోషీతో exercise చేస్తున్నాను అన్నాడు. దేహాభిమానం అలా మనలను పీడించేస్తుంది. లోకవాసన విడిచి పెడుతుంది కానీ శాస్త్రవాసన విడిచి పెడుతుంది కానీ దేహవాసన మనిషిని విడిచిపెట్టదు. దేహవాసన బలీయమైనది ఎంతటి వాడిని అయినా దేహవాసన విడిచిపెట్టదు. దేహం మరణించేటప్పుడు నేను పోతున్నాను, నేను పోతున్నాను అంటాడు అంటే వాడు దేహం తోటి తాదాప్యం పొంది ఉన్నాడు. దేహం తోటి వేరుపాటి కాపురం పెట్టుకోలేదు అందుకే నేను పోతున్నాను, నేను పోతున్నాను అనే దుఃఖం వాడి కూడా ఉంది. ఇది మనస్సు యొక్క కల్పన. ఈ దేహభావన నుంచి, ఈ

మనస్సు యొక్క భావన లోంచి, అహంకారం యొక్క భావన లోంచి ఏ దేవతా పురుషుడో కరుణించి ఖడ్గం తోటి ఖండించాలి కానీ ఇది రచయితలు చేసే పని కాదు, ధనవంతులు చేసేపని కాదు. విద్యావంతులు చేసే పని కాదు. ఏ దేవతో అనుగ్రహించాలి. ఈ మాయ నుంచి తరింపచేసి గట్టుకు చేర్చాలి. ఈ మాయ ఎలా కమ్ముతుంది అంటే నేను ఇంత ప్రేమిస్తున్న దేహం, నేను ఇంత అభిమానిస్తున్న ఈ దేహం, రాత్రి నిద్రట్లో ఏమీ తెలియకుండా మంచం మీద పడి ఉంటే నాకు స్వప్నం వస్తే ఆ స్వప్నంలో వచ్చే దేహం ఏ కాశీ అయినావెడితే మళ్ళీ ఆ దేహం కూడా నేను వెళ్ళిపోతాను. ఆ దేహాన్ని ఎవరైనా తిడితే అప్పుడు నాకు కోపం వస్తుంది. ఇదే మాయ. ఈ దేహం మంచం మీదే ఉంది, ఇంకొక దేహం తోటి కాశీ వెళ్లాను. అప్పుడు ఈ దేహాన్ని ఎవరైనా తిట్టినా నేను పట్టించుకోను. ఆ దేహాన్ని ఎవరైనా తిడితే కోపం వస్తుంది నాకు ఎందుచేత ఆ దేహం తోటి కలిసిపోయాను. నిరంతరం స్వప్నావస్థలోను, జాగ్రదావస్థలోను ఏదొక దేహాన్ని అభిమానిస్తున్నటువంటి ఈ మనస్సుకి జ్ఞానమా? నిద్రట్లో కూడా విశ్రాంతి లేదే, శాంతి లేదే, ఆ నిద్రట్లో కూడా ఏదొక దేహాన్ని పట్టుకుని ప్రయాణాలు చేస్తూ ఉంటే మళ్ళీ ఆ దేహాన్ని ఎవరైనా విమర్శిస్తే కోపం. ఆ దేహాన్ని ఎవరైనా పొగిడితే సంతోషం. మళ్ళీ ఆ దేహం యొక్క సుఖం కోసం జీవిస్తూ ఉంటుంది. జీవుడు అంటే ప్రతీవాడికి ఇష్టమే. సుబ్రహ్మణ్యం గారితోటి రమణమహర్షిగారు అన్నారు ఒకసారి ఏవండీ సుబ్రహ్మణ్యం గారు మీరు జీవలక్షణాలు పెట్టుకుని కూర్చొన్నారు. మీరు ఈ జీవత్వాన్ని ఎలా భరిస్తున్నారు? ఎంత బరువైనది? ఎంత భారమైనది? ఎలా మోస్తున్నారు అండి జీవత్వాన్ని అన్నారు.

మీ అందరికి తలొక పేరు ఉన్నట్టు నాకు కూడా ఒక పేరు ఉంది. నా పేరు వెంకటరామరాజు. మనం అబద్ధాలు చెప్పుకోవద్దు. నిజం చెప్పుకుంటున్నాం. మీకు అందరికి శరీరం ఉంది ఆ శరీరానికి ఒక పేరు ఉంది. మీకు ఒక శరీరం ఉందని, ఆ శరీరానికి ఒక పేరు ఉందని, నేను ఉంటే అది తెలుస్తోందా? నేను లేకుండానే అది తెలుస్తోందా? నేను ఉంటేనే నాకు రూపం ఉందని తెలుస్తుంది. నేను ఉంటేనే నాకు ఒక పేరు ఉందని తెలుస్తుంది. ఆ నేను ఉంది కాబట్టి ఇవన్నీ తెలుస్తున్నాయి. నేను లేకపోతే ఏమీ లేదు. వీటినన్నింటిని తెలుసుకునే ఆ నేను ఎవరు? మీరు రాముడు గురించి, కృష్ణుడు గురించి, స్వర్గ లోకం గురించి, వైకుంఠం గురించే కానీ నేను గురించి మీరు ఆలోచించరా? ఈ విషయాలు మీకు పట్టవా? ఈ నేను గురించి మీరు ఆలోచించరా?

మనకు భక్తి చాలు అండి, ఏవో కోరికలు కోరికలు అంటున్నారు, భక్తి మీకు సంతృప్తి ఇవ్వటం లేదా? భక్తి దానంతట అది మీకు సంతోషం కలుగజేయటం లేదా? ఏమిటి ఇంక మీకు కోరికలు నెరవేరేది? భక్తి దానంతట అదిగా మీకు సహాయం చెయ్యలేకపోతే, భక్తి తనంతట తానుగా మీకు సుఖం ఇవ్వకపోతే, అది శాంతి ఇవ్వకపోతే అది భక్తే కాదు. భక్తి పేరు చెప్పేటప్పటికి మీకు సంతోషం రాకపోతే, ఆనందం రాకపోతే మీ మనస్సు పులకరించకపోతే, మీకు శాంతి దొరకకపోతే అది భక్తి కాదు. మీరు భక్తి వల్ల ఏదో సాధించాలి అనుకుంటున్నారు. భక్తి వల్ల కోరిక నేరవేరాలి అని మీరు అనుకుంటున్నారు. అలా కాదు భక్తి తనంతట తానుగా మీకు సంతృప్తి ఇవ్వటం లేదా? భక్తి శక్తి లేనిదా? మీరు భక్తిని సాధనగా పెట్టుకుని ఏదో పొందాలి అని చూస్తున్నారు. అంటే మీ లక్ష్యం భక్తి కాదు అన్నమాట. అంటే భక్తి మీకు సంతోషాన్ని ఇవ్వటం లేదా? భక్తి వల్ల మీకు ఆనందం రావటం లేదా? ఎందుకు భక్తిని అలా కించ పరుస్తున్నారు మీరు? జాగ్రత్తగా ఆలోచించండి. భక్తి అంత అల్పం అయినదా? భక్తి అంత స్వల్పం అయినదా? నిజంగా కనుక మీకు భక్తి ఉంటే ఆ భక్తి వల్ల వచ్చే సంతోషాన్ని మీరు తట్టుకోగలరా, ఆ ఆనందాన్ని, ఆ శాంతిని, ఆ సంతోషాన్ని మీరు మోయగలరా? అంతకు మించి మీకు ఏమి కావాలి? పూజలు చేస్తున్నాం అని చెబుతున్నారు మంచిదే. ఆ చేసేవాడు ఎవడు? చేయించుకునేది ఎవడు? మీకు అందరికి భక్తి ఉంది కానీ అద్వైత భక్తి ఎలా ఉంటుందో కొన్ని క్షణాలైన మీరు అనుభవించారా జీవితంలో, రోజులు అక్కర్లేదు, గంటలు అక్కర్లేదు, అద్వైతభక్తి అనేది ఎలా ఉంటుందో, కొన్ని క్షణాలు మీరు అనుభవించారా? జీవితంలో తాత్కాలికం అయినటువంటి సుఖాలు కోసం, తాత్కాలికం అయినటువంటి సంతోషాలు కోసం, తాత్కాలికం అయిన ఉద్రేకాల కోసం ఎంతో డబ్బు ఖర్చు పెడుతున్నాం, ఎంతో కాలాన్ని ఖర్చు పెడుతున్నాం. ఎంతో శ్రమని ఖర్చు పెడుతున్నాం, ఎంతో శక్తిని వేస్ట్ చేస్తున్నాం, కానీ భక్తి కోసం మీరు ఏమి చేశారు? భక్తి యొక్క రుచి మీకు దొరకటం లేదా

గాఢనిద్రలో మీకు తలంపు లేదు. తలంపు లేనప్పుడు జీవుడు లేడు. తలంపు లేనప్పుడు దేవుడు లేడు. తలంపు లేనప్పుడు జగత్తు లేదు. ఎంత దూరం తీసుకు వెళు తున్నాడు అండి స్వామి. దేవుడు లేడు అంటే అక్కడ భక్తి లేదు అని కాదు రమణస్వామికి. భక్తి ఉంది కానీ మీకు నిజం చెప్పి మిమ్మల్ని మోక్షస్వరూపులని చేయాలనీ, మోక్షస్థితి అనుభవం అయ్యేలా చెయ్యాలని, మీ స్వరూపం దగ్గరకి మిమ్మల్ని తీసుకు వెళ్ళాలని, ఆ వాంఛ, ఆపుకోలేని ప్రేమ కాని ఆయనకు భక్తి లేదు అని కాదు. రమణ స్వామికి దేవుడు

ముఖ్యం కాదు. నిజం ముఖ్యం. ఏది విప్లవం, మిమ్మల్ని మీరు బాగు చేసుకోవటం కంటే విప్లవం ఈ లోకంలో ఏదైనా ఉందా? ఒక మనిషి, ఇంకొక మనిషి కర్రలు పెట్టి కొట్టుకుంటే, ఒక మనిషి ఇంకొక మనిషి కత్తులు పెట్టి నరుక్కుంటే అది విప్లవం అని అంటున్నారు. అది విప్లవం కాదు. మీ మనస్సుని మీరు బాగుచేసుకుంటే అది విప్లవం. మిమ్మల్ని మీరు సంస్కరించుకుంటే, మిమ్మల్ని మీరు బాగుచేసుకుంటే అదే విప్లవం. అంతకంటే నిజమైన విప్లవం లేనే లేదు. మిమ్మల్ని నిజం దగ్గరకు లాక్కు వెళ్ళాలని, ఆ నిజం అనేది ఎలా ఉంటుందో మీకు రుచి చూపించాలని, లోకాలు లేని స్థితిలో, దేవతలు లేని స్థితిలో, శరీరాలు లేని స్థితిలో, ఆనందసముద్రంలో మిమ్మల్ని ముంచాలని, రమణస్వామి మీకు తెలియకుండా మిమ్మల్ని అక్కడకు లాక్కుపోతున్నాడు. ఏది తలంపు? ఏది మనస్సు? తలంపుల యొక్క మూటే మనస్సు. తలంపు లేనిదే జీవుడు లేడు. తలంపు లేని చోట దేవుడు లేడు. అని ఎక్కడికో తీసుకు పోతున్నాడు. మీరు ఉక్కిరిబిక్కిరి అవ్వద్దు. మీరు కంగారు పడద్దు. మధ్యలో మిమ్మల్ని విడిచిపెట్టడు, దారిలో మిమ్మల్ని విడిచి పెట్టడు. గమ్యానికి తీసుకు వెళతాడు. నిజం అనేది కొంచెం కొంచెం రుచి చూపిస్తున్నాడు. ఒక్కసారే చెబితే మీరు తట్టుకోలేరు, నిజం తెలిసే వరకు మీకు దుఃఖం ఆగదు. నిజం తెలిసేవరకు మీకు లోకాలు తిరగటం తప్పదు, నిజం తెలిసేవరకు శవాలు మోయటం తప్పదు. నిజం తెలిసేవరకు పుట్టటం తప్పదు, నిజం తెలిసేవరకు మరణించటం తప్పదు, నిజం తెలిసేవరకు ప్రయాణాలు తప్పవు, నిజం తెలిసేవరకు బాధలు తప్పవు, దుఃఖాలు తప్పవు. అందుచేత నిజం దగ్గరకి తీసుకు వెళ్ళటం కోసం నెమ్మదిగా పునాదులు వేస్తున్నాడు. మన చేతిని ఆయన చేతితో పట్టుకొని నెమ్మదిగా నడిపిస్తున్నాడు. మిమ్మల్ని భయపెట్టటానికి కాదు, కంగారు పెట్టటానికి కాదు. నిజం దగ్గరకు తీసుకు వెళ్ళటం కోసం ప్రయాణం చేయిస్తున్నాడు. మనం ఒక అడుగు అయినా వెయ్యాలి. మనం వందమైళ్ళు నడవాలి అనుకుంటే ముందు ఒక్క అడుగు అయినా ఎదరకివెయ్యాలి. నిజం వైపు నడిపించటం కోసం కొన్ని అడుగులు అయినా ఎదరకి వేయించటం కోసం నిజం చెప్పటం కోసం ఇవి అన్నీ చెప్పుతున్నాడు కానీ, ఆయనకి భక్తి లేక కాదు. లోకాన్ని గురించి తెలియక కాదు.

తలంపుల యొక్క మూటే మనస్సు. అయితే తలంపు లేకపోతే జీవుడు లేడు. ఆ తలంపు లేకపోతే లోకం లేదు. తలంపు లేకపోతే దేహం లేదు. తలంపు లేకపోతే ఏదీ లేదు. తలంపే నిన్ను ముడి వేస్తుంది. తలంపే నీకు దుఃఖం తీసుకు వస్తుంది. మీరు అమృత

స్వరూపులే, అమృతస్థితి మీ హృదయంలో ఉందని, అక్కడ సత్యం ప్రకాశిస్తోందని, మీ హృదయంలో శాంతి తాండవిస్తోందని చెప్పేవాళ్ళు ఈ లోకంలో ఎవరూ లేరా అని అడిగారు ఆచార్యులవారు, దేహంలేని స్థితి లోకి, లోకంలేని స్థితి లోకి, జీవుడు లేని స్థితిలోకి, స్వర్గం నరకం అనేవి లేని స్థితిలోకి మనలని ప్రయాణం చేయించటానికి మొదటి అడుగు వేయమంటున్నాడు రమణస్వామి. ఒక్క అడుగు అయినా వేయండి. నిజం వైపు ప్రయాణం చెయ్యటం కోసం ఒక్క అడుగు అయినా ప్రయాణం చేయండి. ఒకసారి రమణస్వామిని ఒక ప్రశ్న అడిగారు, మీకు మాకు వ్యవహారాలు లేవు. ధాన్యం వ్యాపారం, కొబ్బరికాయ వ్యాపారం మీకు మాకు వ్యాపారాలు ఏమీ లేవు. అయితే మీరు నాతోటి ఎందుకు మాట్లాడుతున్నారు? కరుణ వల్ల, Out of love, అంటే ఆయన చెప్పిన మాటలు అన్నీ కరుణే, ఈ మాటలు ఎందుకు చెబుతున్నాను అంటే ఆయన నోటి లోంచి జారిన మాటలు అన్నీ ప్రతీ మాట కరుణే. అవి వ్యవహారానికి సంబంధించిన మాటలు కాదు. ప్రేమ వల్ల వచ్చిన మాటలు, కరుణ వల్ల వచ్చిన మాటలు, ఆ మాటల్లో ఉన్నది జ్ఞానమే, వ్యవహారం కాదు. నిజమైన జ్ఞానం, వాళ్ళ లక్ష్యం ఒక్కటే. మనలని కూడా తన అంతటి వాడిని చేయాలి అని, వాడు నిజమైన జ్ఞాని. మనలని కూడా తనంతటి వాడిని చేయాలి అని అదే జ్ఞాని యొక్క లక్ష్యం.

సద్గురువు సద్గురువు అంటే మీరు తీసుకెళ్ళే మిఠాయిలు తిన్న వారు కాదు, ఆ జీవుడిని బంధంలోంచి విడిపించేవాడే సద్గురువు. సత్పురుషుల సహవాసం కూడా ఎన్నో జన్మల నుంచి చేసుకున్న పుణ్యం ఉంటే కానీ రాదు. ఆ పుణ్యం పండితే కానీ సత్పురుషుల సహవాసం దొరకదు. జాగ్రత్తగా వినండి భగవాన్ చెప్పే మాటలు. భగవాన్ చెప్పే మాటలు వాస్తవం. ఇది దుమ్ము కాదు సొమ్ము. మురికిలో ఉన్న మీ మనస్సుని బయటకి తీసి శుభ్రం చేసి విశాలం అయిన బ్రహ్మం వైపు నడిపించటం కోసం చేసే ప్రయత్నమే రమణస్వామి చెప్పే మాటలు. పాదపూజలు కానీ, దండలు కానీ, అభిషేకాలు కానీ, లోకం కొట్టే జేజేలు కానీ, జ్ఞానికి ఏమి సంబంధం లేదు. మనం లోకాన్ని చింతిస్తున్నాం, భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే నువ్వు ఆత్మని చింతించటానికి, ఆత్మను ధ్యానం చేయటానికి నిరంతరం ప్రయత్నం చెయ్యి. ఆత్మనే ధ్యానం చేస్తూ ఉండు, ఆత్మనే చింతిస్తూ ఉండు, ఆత్మ గురించి మాట్లాడుతూ ఉండు, లేకపోతే ఎదుటి వాళ్ళు చెబుతూ ఉంటే ఆత్మ గురించి శ్రవణం చెయ్యి. వినటం అంటే చెవులు ఇక్కడ ఉండటం కాదు. చెవులు అందరికి ఉన్నాయి. కొంతమంది ఏమి చేస్తారు చెవులు ఇక్కడ ఉంచి వినేవాడిని పాలకొల్లు పంపుతూ

ఉంటారు. ఏవండీ చెవులు వింటున్నాయా? చెవులు ద్వారా వినేవాడు ఒకడు ఉన్నాడు. వాడు ఇక్కడ ఉండాలి. వాడు పాలకొల్లు వెళితే లాభం లేదు. మిమ్మల్ని విను విను అంటున్నాం. ఎవరికి మీ చెవులకి కాదు నేను చెప్పేది. మీ చెవుల ద్వారా వినేవాడికి చెబుతున్నాను వినమని. మీకు కాదు మీరు కోపాలు తెచ్చుకోకండి.

ఈ మధ్య పూనాలో శాంతి అనే ఒకమ్మాయి చచ్చిపోయింది. ఆవిడ బ్రహ్మచారిణి. ఆవిడ వయస్సులో ఉండగా ఎంతో ధనవంతులు, ఎంతో విద్యావంతులు, ఆవిడని వివాహం చేసుకుందాం అని వచ్చారు. కానీ ఆవిడ వివాహం చేసుకోలేదు. ప్రజాసేవ కోసం ఆవిడ జీవితం అంతా ఖర్చు పెట్టింది. పరమాత్మను తెలుసుకోవటం కోసం, ఆత్మను దర్శించటం కోసం, ఆత్మ సాక్షాత్కారం కోసం, తాను కాని దాన్ని అంతా కూడా, సర్వస్వం కూడా అతి తేలికగా విడిచి పెట్టగలిగింది. ఆవిడ మరణించిన రోజున ఒకతను వచ్చాడు. చేతులు పట్టుకుని ఏడుస్తున్నాడు. అప్పుడు అందరు అడిగారు. ఏమిటయ్యా, నువ్వు చేతులు పట్టుకుని ఏడుస్తున్నావు అని. ఆ చేతులు నన్ను ఎన్నో సార్లు ఆశీర్వదించినవి. ఆ చేతులు తోటి ఎంతో సహాయం పొందాను. ఆ చేతులు ఇప్పుడు కదలటం లేదు. నాకు ఎంతో సహాయం చేసిన చేతులు, నన్ను ఆశీర్వదించిన చేతులు, నా మేలు కోరిన చేతులు, కదలకుండా పడి ఉన్నాయి. అని చేతులు పట్టుకుని ఏడుస్తున్నాడు. అంటే ఎంతో గొప్ప దానాలు చేసింది ఆవిడ. గొప్ప పనులు చేస్తే ఎవరు చూడరు అని ఈ లోకానికి సంబంధించిన మనుషులు అనుకొంటారు. కానీ ఈశ్వరుడు చూస్తాడు. ఉపనిషత్తులలో, వేదాలలో ఈశ్వరుడిని సాక్షి, సాక్షి అని వర్ణించారు. మనకి ఏమి జరిగినా మన జీవితంలో ఏమి జరుగుతున్నా ఏది మాట్లాడినా, మాట్లాడకపోయినా, తలంపు వచ్చినా, తలంపు రాకపోయినా లోపల సాక్షిగా ఉండి చూస్తున్నాడు భగవంతుడు. అందుకే భగవంతుడికి సర్వసాక్షి అనే పేరు. రమణస్వామి ఏమన్నాడు అంటే సాక్షి సాక్షి అంటున్నావు. నేను కాదు అనటం లేదు. సాక్షి అంటే రెండు ఉండాలి. చూడబడేది ఉండాలి, చూసేవాడు ఉండాలి. రెండు ఉన్నాయా సాక్షి అని చెప్పటానికి అన్నాడు రమణస్వామి. మీరు ఏదైనా పని చేసారు అనుకోండి నేను సాక్షి. అంటే మీరు చేసిన పని నేను చూస్తున్నాను. అంటే రెండు ఉన్నాయి అన్నమాట అక్కడ, భగవంతుని సాక్షి అని చెబుతున్నారు. మంచిదే. అతను సాక్షిగా ఉండటానికి రెండవది ఉందా? తనకంటే వేరుగా ఏదైనా ఉందా? ఇక్కడ కూడా ద్వైతం ఉంది అని ఆపు చేశారు. ఆయన రమణస్వామి అంటే ఆయన విప్లవకారుడు. ఉపనిషత్తులలో వర్ణించిన

మాటలని, వేదాలలో వర్ణించిన మాటలని, కాదనకుండా వద్దనకుండా అమర్యాద చేయకుండా మర్యాదగా దాటి వెళ్ళిపోతున్నాడు రమణస్వామి. మనలను కూడా ఆయనతో తీసుకు వెళుతున్నాడు, చెవులుఉన్నవాళ్ళు వినండి. కళ్ళు ఉన్నవాళ్ళు చూడండి. ఉపనిషత్తులలో కొన్ని పేజీలు తరబడి వర్ణించారు. భగవంతుడు హృదయంలో సాక్షిగా ఉన్నాడు అని. మీరు చేసే పనులకి, ఈ లోకానికి జన్మ జన్మల నుంచి నువ్వు పోగు చేసుకు వస్తున్న ఈ వాసనలకి ఈ గుణాలకి, ఈ తలంపులకి, సాక్షిగా ఉన్నాడు పరమేశ్వరుడు అని చెప్పారు. అది రైటే. భగవాన్ ఏమి అంటున్నారు సాక్షిగా ఉన్నాడు అని చెబుతున్నారు. చూడబడేది ఉన్నప్పుడు సాక్షి. అసలు చూడబడేది ఉందా? మనకంటే వేరుగా ఇంకొకటి లేని చోట సాక్షి ఏమిటి? వేరుగా ఉందా?నీకంటే భిన్నంగా ఏదైనా ఉందా?ఉంటే అది నిజమా? మనయందు ప్రేమ వల్ల, మనకు నిజం చూపించాలని, ఇది అంతా చెపుతున్నాడు. అందుచేత మిమ్మల్ని మీరు హింస పెట్టుకోవద్దు. మిమ్మల్ని మీరు దగా చేసుకోవద్దు. ఇది నిజం అని ఎత్తి చూపిస్తున్నాడు రమణస్వామి.

మీరు దేనికి దుఃఖపడకండి. మీరు ఆత్మస్వరూపులు మీరు దుఃఖపడటానికి ఏముంది ఈ లోకంలో అంటున్నాడు రమణ స్వామి. ఎంత దూరం తీసుకు వెళుతున్నాడు. మాకు మోక్షం కావాలి, మాకు మోక్షం కావాలి అని మీరు ఎంతో తపన పడుతున్నారు. రమణస్వామి అనేది ఏమిటంటే మీరు అందరు మోక్షం కావాలి అంటున్నారు. ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? అరువు బేరాలు వద్దు, అరువు మాటలు వద్దు, పరలోకం గొడవ వద్దు, దేవుడు గొడవ వద్దు, మీరు మోక్షం కావాలి అని అడుగుతున్నారు రైటే. కాని ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ఇప్పుడు మీరు మోక్షంలోనే ఉన్నారు. మీ హృదయానికి భక్తి సంతృప్తిని ఇవ్వటం లేదా? మీ హృదయానికి భక్తి సంతృప్తి ఇవ్వలేకపోతే అది భక్తా? దేహాన్ని నడిపించే ప్రేమ, లోకాన్ని నడిపించే ప్రేమ, మనస్సుని నడిపించే ప్రేమ, వాటివల్ల ఈశ్వరుడు కట్టుబడడు. ఈ ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించాలి అనుకుంటే పరమేశ్వరుడు పట్ల, ఆ పరమేశ్వరుడు ఉనికి పట్ల పూర్ణమైన విశ్వాసం, నిండు మనసుతో కూడిన విశ్వాసం, మీకు ఉంటే మీరు క్రుంగవలసిన అవసరం లేదు. అటువంటి విశ్వాసం మీ హృదయాలలో ఉందా? మీ హృదయాలలో తడిమి చూసుకోండి, వెతుక్కోండి మీ మనసులో వెతుక్కోండి. మీకు అటువంటి విశ్వాసం ఉందో లేదో. మీరు చేసే సాధనలకి మీరు కేంద్రం అవ్వకూడదు. ఈశ్వరుడు కేంద్రం అవ్వాలి. మీకు ఈశ్వరుడు మీద ఉన్న ప్రేమ, మీకు ఈశ్వరుడు మీద

ఉన్న భక్తి నిజం అయితే మీకున్న దుఃఖాన్ని మింగగలరు. మీకు ఎవరికైనా దుఃఖం ఉంది అనుకోండి మీ భక్తి ఏమో పులి, అది మీ దుఃఖాన్నిమింగలేదా? మీ భక్తి నిజం అయితే మీ బాధలని మింగలేదా? మీ దుఃఖాన్నిమింగలేదా?

మనస్సు ఎప్పుడు ఒకేసారి రెండు పనులు చేయదు. అది చేస్తే విషయచింతన అయినా చేస్తుంది లేకపోతే ఆత్మచింతన అయినా చేస్తుంది. మనం ఇప్పుడు ఏమి చేస్తున్నాం, అంటే లోకానికి దగ్గరగా ఉంటున్నాం, దేవుడికి దూరంగా ఉంటున్నాం. మీరు శివ నామమో, దేవి నామమో, రామ నామమో, కృష్ణ నామమో చేయండి మంచిదే. కానీ మీరు చేస్తున్న నామం పట్ల మీకు ప్రీతి ఉందా? మీకు ఇష్టం ఉందా? లేకపోతే అయిష్టంగా చేస్తున్నారా? అది జాగ్రత్తగా చూసుకోండి. ఓ అర్జునా యుద్ధం చేయటం తప్పదు. మీరు రమ్మంటే నేను ఇక్కడకి వచ్చాను. ఇప్పుడు యుద్ధం చేయను అంటున్నావు. నీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి నీకు ఇష్టమున్నా, ఇష్టం లేకపోయినా, యుద్ధం చేయక తప్పదు. అది నీ దేహ ప్రారబ్ధం. అంటే మీరు చేయవలసిన పని ఎలాగూ తప్పదు కాబట్టి మీరు ఇష్టం తోటి చేయండి. మీరు ఇష్టం తోటి చేస్తే కొత్త వాసనలు రావు. కొత్త సంస్కారాలు రావు. పాతవి పోతాయి. అంటే మీకున్న ప్రారబ్ధం ఖర్చు అయిపోతుంది. అయిష్టంతో చేసి మీ మనసును పుండు చేసుకోకండి. మీ శరీరం ద్వారా జరగవలసిన పని మీకు ఇష్టం ఉన్నా జరుగుతుంది. ఇష్టం లేకపోయినా జరుగుతుంది. ఆ చేసేపని ఏదో ఇష్టంగా చెయ్యి. ఇష్టంగా చేస్తే మీ మనస్సు పుండు అవ్వదు. ఇదే గీత యొక్క సారాంశం. నేను ఆ పని చేశాను, ఈ పని చేశాను అంటున్నావు. నువ్వు పని దేనితోటి చేస్తున్నావు? దేహం తోటి చేస్తున్నావా? దేహం లేకుండానే చేస్తున్నావా? దేహం తోటే చేస్తున్నావు. అయితే దేహం నువ్వా? మీరు ఆలోచించండి. నిజమా? అబద్ధమా? దేహం తోటి నువ్వు చేస్తున్నావు రైటే. దేహం నువ్వా? కాదు. ఇంక చేయటానికి ఏముంది? నోటి తోటి చెప్పుకుంటున్నాం ఈ మాటలు. కానీ ఈ మాటలు యొక్క అర్ధం, ఈ మాటలు యొక్క బరువు ఈ మాటలు యొక్క అంతరార్థం మీకు అందాలి.

నేను ఏదో మాట్లాడుతున్నాను అని నేను చెప్పే మాటలు మీరు నమ్మక్కర్లేదు. అలాగే మీరు పుస్తకం చదివేటప్పుడు కూడా ప్రతీది మీరు నమ్మకండి. మీకు భగవంతుడు కాళ్ళు ఎలా ఇచ్చాడో, చేతులు ఎలా ఇచ్చాడో, కళ్ళు ఎలా ఇచ్చాడో, ముక్కు ఎలా ఇచ్చాడో బుద్ధిని కూడా అందరికి అలాగే ఇచ్చాడు. బుద్ధికి కూడా పని చెప్పండి. మీ కాళ్ళకి ఎలా పని చెబుతున్నారో, చేతులకి ఎలా పని చెబుతున్నారో, అలాగే మీ బుద్ధికి కూడా పని చెప్పండి.

ఎవరు ఏ మాట చెప్పినా మీరు ఏ పుస్తకం చదివినా మీ బుద్ధి తోటి మీరు ఆలోచించుకోండి. మీకు ఆలోచించుకునే పని లేనప్పుడు మీకు బుద్ధి ఎందుకు ఇచ్చాడు పరమేశ్వరుడు. పరమేశ్వరుడు బుద్ధి ఇవ్వలేదా? ఆలోచించటానికి కాకపోతే బుద్ధి ఎందుకు పనికి వస్తుంది? అంటే బుద్ధిని ఉపయోగించుకో. మనస్సు అనేది ఎక్కడో లేదు. మీకంటే భిన్నంగా లేదు. ఏదైతే నేను నేనుఅంటున్నావో ఆ నేనే మనస్సు. ఆ నేను కంటే వేరుగా మనస్సు లేదు. ఆ నేనే మనస్సు. ఆ నేనే జీవుడు, ఆ నేనే చిజ్జడ గ్రంధి. ఆ నేనే సూక్ష్మశరీరం. ఆ నేను ఉంటే స్వర్గం ఉంది. ఆ నేను ఉంటే నరకం ఉంది. ఆ నేను ఉంటే అంతా ఉంది. ఆ నేను ఉంటే దేవతలు ఉన్నారు. ఆ నేను లేకపోతే ఏది లేదు. అందరం చేస్తున్న తప్పు ఒక్కటే. సాధనలు పేరు మీద, పూజలు పేరు మీద, ఆడంబరాలు పేరు మీద, విద్యతో, డబ్బుతో, గొప్పలతో, గౌరవాలతో నేనుని అలంకరించుకొంటున్నాము. ఈ అహంకారాన్ని అలంకరించుకున్నంత కాలం మోక్షం అనే తలుపు మనకోసం తెరవడు. ఎన్నిసార్లు తలుపులు తట్టినా నువ్వు ఎవరివో నాకు తెలియదు బయటికి పొమ్మంటాను అన్నాడు ఈశ్వరుడు. అక్కడ పరలోకంలో ఈ గొప్పలు చెల్లవు. ఈ అధికారాలు అక్కడ చెల్లవు, ఈ గౌరవాలు, ఈ కృత్రిమ జీవితాలు అక్కడ చెల్లవు. పాల్ బ్రంటన్ అన్నాడు నా జీవితంలో ఎన్నో రహస్యాలు ఉన్నాయి. ఎన్నో దాచుకోవలసిన విషయాలు ఉన్నాయి. లోపల చాలా గొడవలు ఉన్నాయి. కానీ ఏ విషయం అయితే దాచుకుందాం అనుకుంటున్నానో ఏ విషయం అయితే రహస్యంగా నా హృదయ పేటికలో ఉంచుకుందాం అనుకుంటున్నానో అది ఆయనకు (రమణమహర్షికి) తెలిసిపోతోంది అని నాకు తెలుస్తోంది. ఇంక ఎలాగ దాచుకోవడం? అందుచేత ఆయనకు తెలియకుండా ఎలా పారిపోవాలో, ఆయనకు తెలియకుండా ఎలా దాచుకోవాలో ఎంత ప్రయత్నం చేసినా నాకు తెలియటం లేదు అన్నాడు Brunton. ఆయన హృదయంలో ఉన్న బరువులు ఏంటో గ్రహించి అవి బయటకి లాగి మంట పెట్టటానికి ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో వాడు గురువు. మిగతా వాళ్ళు గురువులు కాదు బరువులు. ఈ ఋషి నుంచి, ఈ wonderful మాన్ నుంచి తప్పించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాను. నాకు పారిపోవాలని ఉంది. పారిపోవటానికి యోగ్యత సరిపోవడం లేదు. శక్తి సరిపోవటం లేదు అన్నాడు. మన హృదయంలోనిరాళ్ళని మనంతట మనం స్వప్రయత్నం చేత బయటకి లాగలేము. మన హృదయంలో ఉన్న రాళ్లను మన హృదయంలో ఉన్న బరువులను మన తెలివి తేటలవల్ల మన శక్తి వల్ల మనం బయటకి లాగలేము. ఏ దేవతా పురుషుడో, ఏసద్గురువో సహాయం అందించి వాటిని బయటకి లాగాలి గాని కేవలం మన సొంత తెలివి తేటలు సరిపోవు.

మన హృదయంలో ఉన్న బరువైన రాళ్ళని బయటకి లాగటానికి ఈశ్వరుడు యొక్క కరుణ అవసరం. ఆ ఈశ్వరుడే గురువుగా వస్తాడు. నా చివరి ప్రార్ధన ఏమిటి అంటే మీరు ఏ పని చేసినా అది దైవికం అయినా లౌకికం అయినా మీరు ఏ పని చేసినా ఆడంబరం లేకుండా చేయండి. మీరు ఆడంబరం లేకుండా చేస్తే ఈశ్వరుడు సంతోషిస్తాడు. ఈశ్వరుడు సంతోషించి మనకి ఏది అవసరమో అది ఇస్తాడు. ఆడంబరం కోసం పూజ చేయకండి. ఎదుటి వాళ్ళకి మీరు ఏమైనా సహాయం చేసినా ఆడంబరం కోసం చేయకండి. నిర్మలంగా చేయండి, నిరాడంబరంగా చేయండి. నిరహంకారంగా చేయండి. నిర్వికారంగా చేయండి. రమణానుగ్రహం మీ అందరి మీద ఉంది. మీరు లేదు అని అనుకోకండి. అద్వైత శిఖరాల లోంచి, అద్వైత భక్తి లోంచి, అద్వైత స్థితి లోంచి, అద్వైత ఆనందం లోంచి కిందకి జారిపోకండి. మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా సరే ఒకోసారి మాయ అలా కమ్మేస్తుంది. ఏసుక్రీస్తు అంతటి వాడిని మేకులు పెట్టి దేహాన్ని కొట్టినప్పుడు శిలువ వేసినప్పుడు ఆ బాధ భరించలేక ఓ తండ్రీ నన్ను మర్చిపోయావా, నన్ను విడిచి పెట్టేశావా, నన్ను వదిలేశావా అంటాడు. అప్పుడు వెంటనే ఓ తండ్రీ అని నిన్ను నేను ప్రార్థిస్తున్నాను. నిన్ను వేరుగా చూస్తున్నాను కానీ నువ్వు నేను ఒక్కటే కదా! అప్పడు అందుకొన్నాడు అద్వైత శిఖరాలను. అందుచేత గౌరవాలకోసం మీరు ఏపని చెయ్యవద్దు. గొప్పల కోసం చెయ్యవద్దు, ఆడంబరాల కోసం చెయ్యవద్దు. నిర్మలంగా చేసుకోండి. మీరు చేసేది చిన్న పని అయినా, పెద్ద పని అయినా జాగ్రత్తగా చేసుకోండి, ఆడంబరం లేకుండా చేసుకోండి, అప్పడు భగవంతుడు సంతోషిస్తాడు, ఆయన అనుగ్రహం మీకు కలుగుతుంది. వ్యర్థమైన చింతలకు, వ్యర్థమైన కర్మలకు, వ్యర్థమైన కోరికలకు, వ్యర్థమైన తలంపులకు మీ శక్తిని ఖర్చు పెట్టుకోకండి. మీ శక్తిని అనవసర విషయాలకి ఖర్చు పెట్టుకోకండి. మంచి విషయాలకు ఖర్చు పెట్టండి. ఈశ్వరుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. ఈశ్వరానుగ్రహం మీ మీద లేదు అనుకోకండి. ఈశ్వరానుగ్రహం ఎప్పుడు ఉంది అనుగ్రహం ఉందని గుర్తించడం కోసం మనలో సద్గుణాలు ఉండాలి. ఒక మంచి గురువుని జీవితంలో కష్టపడి సంపాదించుకోండి. మీకు నచ్చిన ఒక మంచి గుణం సంపాదించండి. మిగతా అన్ని సద్గుణాలు మీకు వచ్చేస్తాయి. భక్తి అంటే సామాన్యం అనుకోకండి. మీకు అందరికి భక్తి ఉంది చాలా సంతోషం. ఈశ్వరుడు యొక్క అస్తిత్వం పట్ల పూర్తిగా విశ్వాసం ఉంచండి. ఈశ్వరుడు తప్పనిసరిగా మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు. ఈశ్వర స్వరూపాన్ని మీకు ఇస్తాడు. అంతకన్నా మనం కోరగలిగినది కానీ, మనం పొందవలసింది కానీ ఏమీ లేదు.



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**మోహము ద్రప్పి నీ మొహమొనర్చి**

**నా మోహము తీరదా అరుణాచలా!**

తాత్పర్యము: ప్రకృతి మైకము లోనున్న నాకు నీ ప్రేమను రుచి చూపించి, నీమీద నాకు మోహము కలిగించావు. మరి "నిన్ను-నన్ను" వేరుచేస్తున్న నీ మోహము లోనుంచి నన్నెప్పుడు విడుదల చేస్తావు అరుణాచాలా!

మోహము త్రిప్పి నీ మోహమొనర్చి నా మోహము తీరదా అరుణాచాలా! లోకంలో ఉన్న రూపాలు నామాల మీద నాకు మోహం ఏమీ లేదు. ఇప్పుడు నీ మోహం పట్టుకుంది నాకు, అంటే అరుణాచలేశ్వరుడి మోహం పట్టుకుంది. నేను నిన్ను మోహించాను. నీ ప్రేమలో నేను పడ్డాను. నీ మోహంలో ఎందుకు పడ్డానంటే, నాకున్న మోహం తీసేస్తావని, నాకున్న దేహ మోహం, నాకున్న లోక మోహం తీసేస్తావని, నీ మోహంలో పడ్డాను. ఓ అరుణాచలేశ్వరుడా, నీ మోహంలో పడ్డాను కాబట్టి నా మోహం తీసేయ. నీ మోహంలో పడటం కూడా మోహమే. నిన్ను స్మరించటం కూడా మోహమే. అయితే లోకం యొక్క మోహం పోవటం కోసం నీ మోహంలో పడ్డాను.

ఓ అరుణాచలేశ్వరుడా, నిన్ను ప్రేమిస్తున్నాను, నిన్ను ధ్యానిస్తున్నాను. లోకంలో విషయాలు స్మరించటం మానేశాను. నిన్ను స్మరిస్తున్నాను. లోకంలో విషయాలు ధ్యానించటం మానేశాను. నిన్నే ధ్యానం చేస్తున్నాను. నిన్ను తలపెట్టుకొంటున్నాను. నా హృదయం నిండా నువ్వే ఉన్నావు. నిన్ను తలపెట్టటం మట్టుకు మోహం కాదా, నిన్ను స్మరించటం మట్టుకు మోహం కాదా, నిన్ను ప్రేమించటం మట్టుకు మోహం కాదా. అది కూడా మోహమే నయ్యా,

నేను కాదనటం లేదు. నాకున్న లోకం యొక్క జ్వరం, నాకున్న విషయాల యొక్క జ్వరం, తగ్గిపోవటం కోసం నీ మోహంలో పడ్డానయ్యా! ఆ మోహం అంతా పోయిన తరువాత నీ మోహం కూడా తీసెయ్యి అరుణాచలేశ్వరుడా!

నాకు లోకం మీద మోహం తీరిపోయింది. లోకానికి సంబంధించిన తాదాప్యం పోగొట్టుకున్నాను.లోకంలో ఎన్ని ఆకర్షణలు ఉన్నా, ఏదీ నన్ను ఆకర్షించటం లేదు. కానీ నీమీద మోహం ఉంది, నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధి పోలేదు. నువ్వు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి పోవాలంటే, అది నా తెలివితేటల వలన పోగొట్టుకోలేను. ఆ బేధబుద్ధిని పోగొట్టవలసింది నువ్వే. నీ యందు ప్రేమ ఉంది, మోహం ఉంది. నీ మీద ఉన్న మోహం పోతేనేగాని నా స్వరూపం తెలియదు. నువ్వు నాకు వేరుగా కనిపిస్తున్నావు. నువ్వు నాకు స్వరూపంగా దర్శనం ఇవ్వాలి. ఇప్పుడు నువ్వు నాకు భిన్నంగా కనిపిస్తున్నావు, భేదంగా కనిపిస్తున్నావు. నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధి రాకూడదు నాకు. బేధబుద్ధి వస్తే అది పరమస్థితి కాదు, చివరిస్థితి కాదు. బేధబుద్ధి ఉన్నప్పుడు మళ్ళీ ఏదో వరాలు అడగాలి అనిపిస్తుంది. నువ్వు నాకు స్వరూపంగా కనపడాలి. నాలో ఉన్న నిజమైన నేనుగా వ్యక్తమవ్వాలి. నువ్వు నాలో చైతన్యంగా వ్యక్తమవ్వాలి. నాకు బేధబుద్ధి పోయి, అభేదబుద్ధి రావాలంటే నువ్వు స్వరూపంగా వ్యక్తమవ్వాలి అని రమణస్వామి అక్షరమణమాలలో ప్రార్థించారు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శివుడు అంటే ఎవరు!

## నాన్నగారి మాటలలో...

శివుడు ఆదిదేవుడు. జాగ్రదవస్థలో స్వప్నావస్థలో, నిద్రలో మూడు అవస్థలలో మూడు కాలాలలో, ఏదైతే స్వయంగా మీ హృదయంలో, అంటే భౌతికహృదయంలో కాదు ఆధ్యాత్మిక హృదయంలో ఏ వస్తువు అయితే ప్రకాశిస్తోందో, స్వయంవ్యక్తమో, దానంతట అది ఏదైతే వెలుగుతోందో, వాడే శివుడు.

మనలో ఉన్న చైతన్యమే శివుడు. మంగళప్రదుడు ఈశ్వరుడు. ఈశ్వరుడు అంటే రాముడికి కృష్ణుడికి శివుడికి కూడా వర్తిస్తుంది. కానీ ముఖ్యంగా ఈశ్వర శబ్దం ఉచ్ఛరించినప్పుడు శివుడే గుర్తుకు వస్తాడు. రాముడికి తల్లితండ్రులు ఉన్నారు, కృష్ణుడికి తల్లితండ్రులు ఉన్నారు. శివుడికి తల్లితండ్రులు లేరు, స్వయంభువు. స్వయంగా ఉద్భవించిన వాడు. ఆది దేవుడు, నిరాడంబరుడు, నిరహంకారి, దిగంబరుడు. దిక్కులే అంబరములుగా కలవాడు, దిక్కులే బట్టలుగా కలవాడు, పులి చర్మం కట్టుకొని తిరిగే వాడు. కానీ మనకి మంగళప్రదుడు!

మన బుద్ధిలో ఉన్న దోషాలు పోతేనే కానీ మనకి జ్ఞానం కలగదు. ఈ దోషాలు ఎప్పుడో కొన్ని వేలాది జన్మల నుంచి వస్తున్నాయి. కిరసనాయిలు సీసా ఉంది అనుకోండి, మీరు ఎన్ని సార్లు తోమినా వాసన ఎంతో కొంత ఉంటుంది. ఎండలో పది రోజులు పెట్టేస్తే వాసన పోతుంది. ఊరికే తోమేసి ఇంట్లో పెట్టుకున్నా వాసన పోదు. బిరడా తీసేసి ఎండలో పెడితేనే కానీ వాసన పోదు. అలాగే మన బుద్ధిలో ఉన్న దోషాలను ఎండబెట్టాలి.

శివుడు చేసే పని ఏమిటంటే, ముందు మన బుద్ధిని కాలుస్తాడు. కాల్చటం అంటే మన బుద్ధిలో దోషాలు పోగొడతాడు. చట్టం ప్రకారం ఏమిటంటే, బుద్ధిలో ఉన్న దోషాలు బర్న్ అవ్వకుండా, బుద్ధిలో ఉన్న దోషాలు కాలి బూడిద అవ్వకుండా, జ్ఞానం రావటానికి అవకాశం లేదు. అందుచేత ముందు ఆ బుద్ధిలో ఉన్న దోషాలు, బేధబుద్ధి, బలహీనతలు అన్నిటినీ తొలిగించి తరువాత జ్ఞానం ప్రసాదిస్తాడు. అది శివనామం యొక్క ప్రత్యేకత.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

స్వామి వివేకానంద మనస్సులో ఈ శ్లోకంఎప్పుడూ మెదులుతూ ఉండేది. రెండవ అధ్యాయంలో మూడవ శ్లోకం ఇది. ఆయన ఏ దేశం వెళ్ళినా ఈ శ్లోకం మనస్సులో పెట్టుకునే వాడు. పైకి జనరల్ గా ఏది చెప్పినా, ఆయన జీవితం పొడుగునా ఈ శ్లోకాన్ని ధ్యానం చేసేవాడు.

**క్లైబ్యం మాస్మ గమః పార్థ నైతత్త్వ య్యుపపద్యతే।**

**క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప ॥**

**తాత్పర్యము:** ఓ అర్జునా! పిరికితనమునకు లోనుకావద్దు. నీకిది ఉచితము కాదు. ఓ పరంతప! తుచ్ఛమైన ఈ హృదయదౌర్బల్యమును వీడి, యుద్ధమునకై నడుము బిగింపుము.

క్లైబ్యం మాస్మ గమః - బాహ్య పరిస్థితులు ఎప్పుడూ ఒక రకంగా ఉండవు. మారుతూ ఉంటాయి. ఎవరి జీవితంలో అయినా, ఎవరి కుటుంబానికి అయినా, బాహ్యపరిస్థితులు ఎప్పుడూ బాగానే ఉంటాయి అని అనుకోవద్దు. సంసారం అన్నాక హెచ్చుతగ్గులు వస్తాయి. కొన్ని రోజులు మనకి అనుకూలంగా ఉంటాయి, కొన్ని రోజులు ప్రతికూలంగా ఉంటాయి. ఒకోసారి మనం బంగారం అమ్ముకున్న చోటే పిడకలు అమ్ముకోవాలి. అది మనం చూస్తున్నాము కదా అనేక సంసారాలలో! పిడకలు అమ్ముకొనేవాళ్లు బంగారం అమ్ముకొనే రోజులు వస్తాయి. అందుచేత మన పరిస్థితులు ఎలా ఉంటాయో, రేపటి రోజు ఎలా ఉంటుందో మనం చెప్పలేము. బాహ్య పరిస్థితుల మీద ఎప్పుడూ ఆధార పడకండి. బాహ్య పరిస్థితులు మీకు అనుకూలంగా

ఉన్నా ప్రతికూలంగా ఉన్నా, మీ నిదానంలో మీరు ఉండండి.

భగవంతుడు మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని పాడైపోమని చెప్పడు. మీ ఇంటికి వచ్చి మిమ్మలని బాగుపడమని చెప్పడు. మీకు బాగుపడే రోజులు వచ్చాయి అనుకోండి మీకు బాగుపడే బుద్ధి కలగచేస్తాడు. చెడిపోయే రోజులు వచ్చాయి అనుకోండి, మిమ్మల్ని చెడిపోమని చెప్పడు. చెడిపోయే బుద్ధి కలగచేస్తాడు. అంతా మన బుద్ధే కదా. మనం బాగు పడినా మన బుద్ధే కారణం, చెడిపోయినా మన బుద్ధే కారణం. అందుచేత బుద్ధిని కాపాడుకోండి. మీరు బుద్ధిని కాపాడుకొని, మీ బుద్ధికి తెలివితేటలు పెంచుకోండి. మీ బుద్ధిని ఎవరికో అప్పచెప్పేసి, ఎవరి జేబులోనో పెట్టేసి మీరు మొద్దుఅబ్బాయిల లాగా కూర్చోవద్దు. ఎంత చక్కటి ఆర్గ్యుమెంటో చూడండి.

అర్జునా! నీకు పిరికితనం తగదు. ఎవరో మాట ఎందుకు, నువ్వు అనేక యుద్ధాలు చేశావు. ఇప్పుడు యుద్ధం చేయటానికి నీకు పిరికితనం వచ్చేసింది. ఇది నీకు తగునా! నువ్వు ఉత్తరకుమారుడవా! మనకి పిరికితనం వస్తే అది వేరే విషయం. అర్జునుడు అంతటి వీరుడికి పిరికితనం ఎందుకు వచ్చింది! ఇలా నీకు పిరికితనం రావటం న్యాయమేనా! యుద్ధానికి నన్ను రమ్మని నువ్వు పిలిచావు కానీ నిన్ను నేనేమీ రమ్మని పిలవలేదు కదా. నువ్వే కదా నన్ను రమ్మన్నావు. ఇప్పుడు పిరికితనం వచ్చేసింది నీకు. అందరి విషయం నేను చెప్పటం లేదు, ఇది నీకు తగదు అని అర్జునుడితో పరమాత్మ చెపుతున్నాడు.

క్లైబ్యం మాస్మ గమః - ఓ పార్థా! ఇది నీకు తగదు వయ్యా. నువ్వు ఇలా ఉండటం, నీకు పిరికితనం రావటం, భయపడిపోవటం, ఇది నీకు తగదు.

నైతత్త్వ య్యుపపద్యతే - అందుచేత నువ్వు వెంటనే ఈ పిరికితనం లోనుంచి బయట పడాలి. ఇప్పుడు నీకు భయం వేస్తోంది. అది నీ స్వభావం కాదు. ఎలా వచ్చిందో, భయం వచ్చింది. నువ్వు అందులోనుంచి, ఆ స్వభావం లోనుంచి బయట పడాలి. బయట పడటం నేర్చుకో.

క్షుద్రం హృదయ దౌర్భల్యం - ఈ హృదయ దౌర్భల్యం ఉంది చూసారూ, అంటే ధైర్యం లేకపోవటం, ప్రపంచములో అన్నిటికంటే నీచమైనది. ఇక్కడ భగవంతుడు ఎందుకు చెపుతున్నాడు అంటే, ధైర్యం లేనివాడు జ్ఞానం సంపాదించలేడు, ధైర్యం లేనివాడు ఏ పనిలోనూ సక్సెస్ అవ్వలేడు. మీరు పదిరూపాయలు సంపాదించాలన్నా మీకు ధైర్యం

ఉండాలి. ఒక సత్కర్మ చెయ్యాలన్నా మీకు ధైర్యం ఉండాలి. బుద్ధుడికి ఎంత ధైర్యం లేకపోతే గృహపరిత్యాగం చేశాడు! పిరికివాడు చెయ్యగలడా? మనందరికీ కుటుంబాలు ఎలా ఉన్నాయో బుద్ధుడికి కూడా ఉంది కదా. పైగా మనకి ఎంత, ఒక ఎకరమో రెండు ఎకరాలో ఉన్నాయి. వాడు మహారాజు కదా, ఒక పెద్ద రాజ్యానికి అధిపతి. ఇక్కడ మీరు ఆలోచించండి, నోటిమాటలు కాదు. ఎంత ధైర్యం ఉంటే, ఎంత సాహసం ఉంటే, లోపల వాడికి ఎంత బలం ఉంటే, ఒక మహాసామ్రాజ్యాన్ని విడిచిపెట్టి వాడు బయటికి వచ్చాడు! వాడికీ కుటుంబం ఉంది కదా, తల్లి తండ్రి ఉన్నారు, భార్య ఉంది, కొడుకు ఉన్నాడు. ఇంత సామ్రాజ్యాన్ని విడిచిపెట్టటానికి ఎంత ధైర్యం ఉండాలి! అలాగే ఇక్కడ కృష్ణుడు ఏమి చెపుతున్నాడు అంటే, నీకు ఎంతో కొంత ధైర్యం లేకపోతే సత్కర్మ చెయ్యలేవు, స్వార్థం లేకుండా పని చెయ్యలేవు. ఇది చేస్తే ఏమి వస్తుందో, అది చేస్తే ఏమి వస్తుందో అని ప్రతిదానికీ పిరికిపడిపోతుంటే, నువ్వు ఏమీ సంపాదించలేవు. పైగా ప్రపంచంలో నీచమైనది ఏదైనా ఉంటే, అది ధైర్యం లేకపోవటమే. ధైర్యం లేనివాడు ఈలోకంలో పైకి రాలేడు, పోనీ ఈ లోకంలో పైకి రాలేక పోయినా, స్వర్గమో వైకుంఠమో సంపాదించాలంటే, అది అంతకన్నా సున్నా! దిస్ ఈజ్ జీరో, దట్ ఈజ్ జీరో! ఇక్కడా సున్నా అక్కడా సున్నా. అటువంటి క్షుద్రమైనటువంటి, నీచమైనటువంటి పిరికితనం నీకు ఎలా వచ్చింది అర్జునా!

వివేకానందకి ఈ శ్లోకం వాడి గుండెలలో ఉండేది. ఇది రెండో అధ్యాయంలో మూడో శ్లోకం. దేవుడు, స్వర్గలోకం, వైకుంఠం మాట వదిలేయండి, పిరికితనంలో ఉన్నవాడు ఈ లోకంలో కూడా పనికిరాడు. ఎక్కువ పిరికితనం వస్తే, వెంటనే విరోచనాలు పట్టుకుంటాయి, అక్కడినుంచి సెలైనులు ఎక్కించాలి అంటారు. క్షుద్రం హృదయదౌర్బల్యం! ఓ అర్జునా హృదయదౌర్బల్యం అన్నిటికంటే నీచమైనది కాబట్టి దానిని విడిచిపెట్టు.

ధైర్యం లేని మనిషి ఏదీ సాధించ లేడు. పరలోకం సాధించ లేడు ఈ లోకంలో కూడా ఏమీ సంపాదించలేడు. చివరికి ధైర్యం లేని మనిషి పొట్ట పోషించుకోవటం కూడా కష్టం. అందుచేత మీ జాగ్రత్తలో మీరు ఉండి ధైర్యంగా ఉండండి. ప్రతీ చిన్న విషయానికీ మీరు భయపడుతూ ఉంటే, మీ ద్వారా ఏ పనీ జరగదు. లోకం గొడవ వదిలేయండి, మీరు మంచి చేసినా చెడ్డ అనుకుంటారు. అలా భయపడకూడదు. మనం మంచి అని నమ్మినది మనం చేసుకొంటూ వెళ్ళటమే. అంతేకాని వాళ్ళు ఏమనుకొంటున్నారు, వీళ్ళు

ఏమనుకొంటున్నారు అంటే వాళ్ళకి మీ బుద్ధిని అప్పచెప్పేశారు. వాళ్ళు బుద్ధిమంతులు అయితే కదా వాళ్ళ మాటలు మీరు పట్టించుకోవటానికి. ఇంకొకటి, మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తుంటే ఏమీ పట్టించుకోవద్దు. ఎందుచేతంటే మీ క్షేమం కోరేవాళ్ళు, మీరు ఏదైనా పొరపాటు చేస్తూ ఉంటే, ఏవండీ పద్ధతి ఇది కాదు, మీరు ఇలా నడుచుకోండి, ఇలా అయితే నష్టపోతారు జీవితంలో, ఆర్థికంగా నైతికంగా దెబ్బ తింటారు అని మీ ఇంటికి వచ్చి మంచి సలహా చెపుతారు, అది ట్రూ ఫ్రెండ్ యొక్క లక్షణం. అంతే కానీ రోడ్డు మీద ఎవరూ విమర్శించరు. రోడ్డు మీద విమర్శించేవాళ్ళని మీరు పట్టించుకోనక్కరలేదు.

ఉత్తిష్ఠ - నువ్వు పిరికితనం వదిలేసి నిలబడు, నీ కర్తవ్య కర్మని చెయ్యి. అందరూ యుద్ధాలు చెయ్యక్కరలేదు. అర్జునుడి యొక్క ధర్మం ఏమిటంటే, యుద్ధం చెయ్యటం. అలా కొన్ని వందల యుద్ధాలు చేశాడు. అలాగే మీ పని మీరు చేసుకోవటం. మీ ఇంటికాడ మీకేదో పనులు ఉన్నాయి కదా. అదే యుద్ధం. అంటే మీ పనేదో శ్రద్ధగా పిరికితనం లేకుండా మీరు చేసుకోవటమే యుద్ధం. మిమ్మల్ని అందరినీ యుద్ధాలకి వెళ్ళమనటం లేదు. మీరు గతించి పోయిన గొడవల గురించి రోజూ బెంగ పెట్టుకోకుండా - పాస్ట్ ఈజ్ పాస్ట్ జరిగిపోయిన గొడవలు వదిలేసి, వర్తమానకాలాన్ని ఉపయోగించుకొని, మీ కర్తవ్య కర్మలని చేసుకోండీ. భగవంతుడు ఒకో శరీరానికి ఒకో పని కేటాయిస్తాడు. ఆ పని మటుకు మీరు హృదయపూర్వకంగా చేయండి. లోపల ఒక రకంగా బయటికి ఒక రకంగా కాకుండా, మీరు హృదయపూర్వకంగా చెయ్యండి. తరువాత సంసారం పోషించుకోవటానికి ఏవో కొన్ని కామ్యకర్మలు ఉండాలి. కామ్యకర్మలు అంటే మీ శరీరానికి ఇంటికి పనికి వచ్చే కర్మలు కొన్ని మీరు చేసుకోవాలి. లేకపోతే మీ శరీరయాత్ర నడవదు. అంటే కోరిక పెట్టుకొని చేసే కర్మలు అన్నీ కామ్యకర్మలు. అలాగని 365 రోజులు కామ్యకర్మలే వద్దు. కొంత సత్కర్మలు కూడా చెయ్యండి. అంటే మన శరీరానికి మన కుటుంబానికి ఉపయోగపడకపోతే ఈ పని మనం ఎందుకు చెయ్యాలి అనుకోకుండా, సమాజం ఒకటి ఉంది కాబట్టి, ఆ సమాజానికి ఉపయోగపడే పనులు చెయ్యండి. ఆ పని కూడా కర్తృత్వం లేకుండా చెయ్యండి. అహంకారం లేకుండా చేస్తే, ఆ పని కూడా మిమ్మల్ని భగవంతుడిలో ఐక్యపరుస్తుంది. సత్కర్మ కూడా నిష్కామంగా చెయ్యాలి.

కామ్యకర్మలు ఏదో కొంత వరకూ తప్పదు. మీ శరీరాన్ని పోషించుకోవాలి, మీ ఇల్లు పోషించుకోవాలి, లేకపోతే మీకు దేహయాత్ర నడవదు. మన దేహయాత్రకి ఇంకొకళ్ళ మీద ఆధారపడితే బానిసత్వం వస్తుంది. మనం పొట్టకొసం బట్టకోసం ఇంకొకళ్ళ మీద ఆధారపడ్డాము అనుకోండి, ఎక్కడోదాకా ఎందుకు మీ అమ్మ మీద మీరు ఆధారపడ్డారు అనుకోండి, ఆవిడ మిమ్మల్ని బానిస క్రింద చూస్తుంది. పరాయివాళ్లు అక్కరలేదు. మీ ఇంట్లోవాళ్ల మీదే ఆధారపడ్డారు అనుకోండి, కొంతకాలానికి మీరు లోకువ అయిపోతారు. వీళ్ళు నామీద ఆధారపడి బ్రతుకుతున్నారు అని వాళ్ళు అనుకుంటారు. పైకి ఊరికే గౌరవంగా చూసినా లోపల మనస్సులో లోకువతనం వచ్చేస్తుంది మీరంటే. అందుచేత మనకున్నదేదో తక్కువో ఎక్కువో, మన కాళ్ళ మీద మనం నిలబడటం మంచిది. పూర్వపు రోజులలాగా ఆధారపడటానికి ఇప్పుడు కుదరదు. ఎవరి జాగ్రత్తలో వాళ్ళు ఉండవలసిందే. మీరు మీ బుద్ధిని కానీ, ఆలోచన లేకుండా మీ డబ్బుని కానీ ఇంకొకళ్ళ జేబులో పెట్టేయకండి. ఏదో మా అమ్మాయి చూస్తుంది కదా అని మొత్తానికి మీ అమ్మాయికి ఇచ్చేస్తే అసలు చూడనే చూడదు. ఏదో మీ జేబులో పెట్టుకోండి, కొంత మీరు పెట్టుకొంటే, ఆ డబ్బు కోసమైనా మీ మంచం చుట్టూ తిరుగుతుంది. వాళ్ళు మంచివాళ్ళా చెడ్డవాళ్ళా అని కాదు, ఇదీ లోకం యొక్క పోకడ.

మీ బుద్ధిని మీ జేబులో పెట్టుకోండి. ఇంక సాధన చేసేవాళ్ళు ఏడు సార్లు పడిపోతే చతికిలపడిపోకండి ఎనిమిది సార్లు లేవండి. ఇక్కడ అర్జునుడికి కృష్ణుడు ఏమి చెపుతున్నాడు అంటే, నువ్వు చతికిలపడకు, నిలబడు, నిలబడి నువ్వు వచ్చిన పని ఏమిటో అది నువ్వు చూసుకో. ఇలా కూర్చుంటే యుద్ధము ఏమి చేస్తావు నువ్వు, నిలబడు. నిలబడి నీ పని ఏదో నువ్వు చెయ్యాలి. ఇష్టం లేకపోయినా నీకు తప్పదు. రాజీకి చాలా ప్రయత్నాలు చేశారు. నేనేమైనా యుద్ధ ప్రియుడినా, నేనేమైనా యుద్ధం కోరుకున్నానా? మీరు మీరు యుద్ధానికి సిద్ధం అయినప్పుడు, నా అంతట నేను రాజీకి ప్రయత్నం చేస్తానని రాయభారం చేసినా కానీ ఫైల్ అయిపోయింది. నేను మట్టుకు యుద్ధాని కోరుకొంటున్నానా. అందరూ శాంతినే కోరుకున్నారు. కానీ యుద్ధం వచ్చి మన మీద పడింది. ఇప్పుడు మన డ్యూటీ ఏదో మనం చెయ్యాలి అర్జునా! అన్నాడు పరమాత్మ. ఇది వివేకానందకి ఫేవరెట్ శ్లోకం.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **520101264185724**
**UNION BANK OF INDIA, PALAKOL BRANCH**
IFSC Code : **UBIN0916137, Contact No. 9866715896**

# మాట

మనకు వచ్చే తలంపును బట్టి, ఒకమాట మాట్లాడుతాం! ఒకమాట మాట్లాడినప్పుడు, ఏ ఉద్దేశ్యంతోటి, ఏ ప్రేరణతోటి, మాట్లాడుతున్నాము అన్నది ముఖ్యం. మీరు బాగున్నారా? అంటాం! ఆ మాట మర్యాదకోసం అంటున్నామా, యాంత్రికంగా అంటున్నామా, వికటంగా అంటున్నామా, వారి క్షేమము కోరి అంటున్నామా, అన్నది ముఖ్యం. ఏ ప్రేరణ వలన ఆ మాట వస్తోందో, అది ముఖ్యం. ఒక మాటకు ముందున్న స్థితిని అనగా తలంపును, అంతర్యామి చూస్తారు; కారణం పరమాత్మ అనంతుడు, సర్వవ్యాపి, సర్వాంతర్యామి, కాబట్టి! మాటకు, తలంపుకు, ఆధారం హృదయము కాబట్టి, హృదయంలోంచి హృదయపూర్వకంగా, సాటివారి క్షేమం కోరి మాట్లాడాలి. తలంపు, మాట, చేతలలో హృదయం ముఖ్యం. మన మాట సాటివారికి శాంతిని చేకూర్చాలి. మనము మాట్లాడునప్పుడు నాలుక, హృదయంలో ఉండాలి. పవిత్రత లేని మాటలకు, కపటపూరితమైన మాటలకు, అసూయ కారణంగా వచ్చే మాటలకు, సమాజంలో విలువ ఉండదు. వ్యర్థమైన మాటలు వేలాదిగా చెప్పడం కన్నా, శాంతినీ, కాంతినీ, ప్రసాదించే ప్రయోజనకరమైన మాటలు, కొద్దిగా చెప్పినా చాలు! మంచిమాట ప్రపంచమంతా ప్రతిధ్వనిస్తుంది. తనవారని, పగవారని, ఎంచక అహంకార, మమకారములను విడిచిపెట్టి, నిర్మలంగా, శాంతిగా, ఉండాలి. సాధకునికి వివేకము, విచక్షణతో కూడిన బుద్ధి అత్యంత ఆవశ్యకము! ఇతరులకు ఏది చేస్తే అదే మనకు వస్తుంది; ఇతరుల గురించి చెడుగా ఆలోచిస్తే, మనకు చెడే ఎదురొస్తుంది. చెడు ప్రవర్తన కలిగిన మనస్సు, సాటివారు మంచివారైనా వారి హృదయాన్ని అర్థం చేసుకోనివ్వదు. బుద్ధి పాడైతే అధోగతి తప్పదు. సద్బుద్ధిని ప్రసాదించమని గురువును ప్రార్థించాలి! మనము చేసే సాధనలో, భక్తిలో, భావనా బలము ఉండాలి, అనగా హృదయము ఉండాలి. మాటలు మృదువుగా, మితముగా, ప్రియంగా, హృదయపూర్వకంగా, మాట్లాడితే అవి మనోనాశమునకు సహకరిస్తాయి. త్రికరణము ద్వారా చిత్తశుద్ధిని సాధించాలి!

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# అసలైన జీవితం - గురు సన్నిధే

నల్లబల్లమీద అక్షరాలను డస్టరు పెట్టి తుడిచేసినట్లుగా మనలో ఉండే సంస్కారాలను మనమే తుడిచివేయగలమంటే సద్గురువును ఆశ్రయించి, నీవే తండ్రివి, నీవే తల్లివి, నీవే సర్వము, నీవే దేవుడవు, నీవు తప్ప నాకు గతి లేదు అని రెండు కాళ్ళు పట్టుకోవాలి. అహంకారం మర్చిపోయి పాదాలను శరణుపొందాలి. అప్పడే సంస్కారాలు రహితమౌతాయి. ఆధ్యాత్మిక జిజ్ఞాస, నిజాయితీతో కూడిన సాధనను పురస్కరించుకొని గురువుకు విధేయుడై అర్హతగల శిష్యునికి జ్ఞానానుభవం సద్గురువు ఇయ్యగలడు. కామాన్ని జయిస్తే క్రోధం పోదు, క్రోధాన్ని జయిస్తే లోభం వెంటాడుతుంది. లోభాన్ని జయిస్తే అహంకారం శత్రువు అవుతుంది. నా సంతానం, నా సంపద అని ఎల్లప్పడూ అనుకొనేది మనది కాదు, అంతా పరమాత్మదే. కాని మనం వాటికి భిన్నంగా ఊహించుకొంటాము. మనఃస్ఫూర్తిగా గురువు ఎడల నిజమైన ప్రేమ మరియు గురుదర్శనం కోసం నిజమైన తపన ఉన్నట్లైతే లేదా గురుదర్శనం మనం పొందిన ఆనందం గుర్తించుకొన్నా వందల సంవత్సరాలు జపధ్యానాదుల వల్ల కూడా కలుగనంత గొప్ప ప్రశాంతంగా మనస్సు మారిపోతుంది. మహాత్ములంతా 'సాధన చెయ్యి కానీ గురువు దయ పొంది వారి సహాయాన్ని తీసుకొని సాధన చెయ్యి' అంటారు. గురువును ప్రేమించు. అందరిలోనూ గురువు ఉన్నాడనే దృక్పథంతో అందరినీ ప్రేమించు. ఈ సృష్టిని అంతనూ ఎలాగూ ప్రేమించలేవు అనుకో నీ పరిధిలో ఎవరినీ ద్వేషించకు. గురువే సత్యమనే ఎరుకతో నిరంతరం ఉంటూ సాధారణ జీవితం జీవించాలి. తద్వారా ఆధ్యాత్మిక పురోభివృద్ధి జరుగుతుంది. అంతే తప్ప అవగాహన లేక, అవగాహనతో కూడిన తెగింపులేక మనం సాధనకు ఉపక్రమిస్తే ఉభయభ్రష్టుత్వమే సిద్ధిస్తుంది. మృత్యువు త్రోసుకొని వచ్చినప్పడు మనం అన్నిటినీ అందరినీ ఇక్కడే వదిలి వెళ్ళాలి, అలాగే నిజాయితీ ప్రతీ నిమిషం దేహంతో తాదాత్మ్యత లేకుండా సంబంధం లేకుండా అన్నిటినీ వదిలివేయాలి, వదిలి ఉండగలగాలి. ఇవి ఏమీ శాశ్వతము కావు, శాశ్వతమైన సత్యత్వ స్థితి ఒకటి ఉంది దానిని పట్టుకోవాలి. దానిని అనుభవించగలగాలి అది ఈ జన్మలోనే అనుభవించాలి. ఇంకా ఎన్నో జన్మలు నాకు అవసరం లేదు అనే కాంక్షతో గురువు ఎడల విశ్వాసం కలిగి ఆ లక్ష్యమును చేరు మార్గములో ఆధ్యాత్మిక దృక్పథం కలిగి ప్రయాణం చెయ్యాలి. శ్రీనాన్నగారు "నీవు కాసేపు ముక్కులో గాలి పిల్చుకొని, గురు రూప ధ్యానంలో ఉండు. నీవు ఊరికే చేతులు ఊపు అంటే సాధన పేరు మీద ఇలా గడిపితే ఉన్న పని సత్యానుభవం పొందే పని నేను చూసుకొంటాను. ఒక్క తన్నుతో ఆత్మ గూటిలో నిన్ను పడవేస్తాను" అంటారు. అన్నిటికన్నా ఉత్తతమైన కోరిక ఏ కోరికా లేకుండా ఉండటమే అంటారు అనుభవజ్ఞులు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**